ఉగాది

శుభాకాంక్షలు

కవితా!

సమకాలీన కవితల కాలనాళిక

మార్చి 2017

GRIEVING DUST

Telugu : BANDLA MADHAVA RAO
Translated by : DEVIPRIYA

Soil means crop
Soil means bread
Soil is true life..

These days
When I embrace soil
It is the dust of grief that drops down,

The soil that was measured
In yards and turned
Money till the other day,
Now folds into its own belly-flank,
And moans helpless and scared;

The one who
Stretched his legs fully
And occupied the land the other day
Is not there today;
I have dissolved in the slippery soil
That had slided from under my feet;

****

Soil means coal
Soil means mineral
Soil is bauxite..
Through multi layered tunnels
Is soil drained out
From dense forests and steep hills
To become wealth that dictate states.

****

Now on
Hands will have no sense of touch..
Soil that was to get wet
To become a womb
Is drying up and cracking..

Seeing the shattered lives
Leaving their lands
To the serpentine world class highways
And searching for a piece of farm
To feed them a meal,
And looking at the baby-slings hung
From the low tree branches,
Rattle the melancholic dry leaves.

Some one
Is staking the soil
To buy kingdoms,
To stomp on enormous empires..
He is indeed shaming the hunger;

The silvery hope that
Descended decades ago is
Now diminishing darker and darker
And the helpless life under the blackish feet
Is reducing to listless pulp.

KRSA101M/130

కవితా!45

సమకాలీన కవితల కాలనాళిక

మార్చి - 2017

నిర్వాహక సంపాదకుడు :
శ్రీశ్రీ విశ్వేశ్వరరావు
సెల్ : 94906 34849

సంపాదకుడు :
బండ్ల మాధవరావు
సెల్ : 88976 23332

బుక్ మేకింగ్ :
ఎ. గిరిధర్
సెల్ : 97042 44344

మాట్లాడండి ! రాయండి !! కలవండి !!!

సాహితీమిత్రులు
Regd No 48/2012/IV విజయవాడ

28-10-26, మసీదు వీధి, అరండల్‌పేట, విజయవాడ - 2
ఫోన్: 0866 2433359 సెల్: 9392971359
kavita.viswam@gmail.com

కవుల, రచయితల అభిప్రాయాలు వారి వారి స్వంతం. అవన్నీ అనివార్యంగా పత్రిక అభిప్రాయాలు కానవసరం లేదు. - పబ్లిషర్స్

కవిత్వ ప్రేమికులకు....

సాహిత్యాభిమానులూ, కవిత్వ ప్రేమికులూ
తమ సంఘీభావం తెలుపుతూ...

సంవత్సరం పొడవునా
కవితా! మీ తలుపు తట్టేందుకు
200 రూపాయలు సాహితీమిత్రుల పేర
M.O.లేదాD.D పంపగలరు.

ఇలా చదవండి.....

పరాయీకరణ తర్కం - బివిజి తిలక్
1,1,1..2,2,2...3,3,3 - మేడక యుగంధరరావు
నాదేశానికి ఇప్పుడే .. - పరాంకుశ నాగరాజు
ఐడెంటిటి - ఉదయమిత్ర
రాత్రి తేలు - (అ) మొయిద శ్రీనివాసరావు
జమీల్యా - కవిత కట్ట
నీవు మంచోడివే - జక్కన్న
వాక్యూమ్ - బేతా రామసూర్యప్రకాశ రావు
ద్రవస్థితి - ఎం.కె.సుగమ్‌బాబు
తిరిగి చిగురించాలని - జన్నతుల్ ఫిరదౌజ్ బేగం
బానిస కల - (అ) మందలపర్తి కిషోర్
నది గోడపై - శైలజామిత్ర
జ్ఞాపకమై - సుపర్ణ మహి
పురాజ్ఞాపకం - తోట శ్రీనివాసరావు
అదృశ్య దృశ్యం - అరుణ్‌బవేరా
వేకువ తీరాన - పక్కి రవీంద్రనాథ్
యుద్ధంసోకని... - శాంతసుందరి
దృశ్యావిష్కరణ - జూకంటి జగన్నాథం
ఆమె - బండారు ప్రసాదమూర్తి
ఏకాంతం - (అ) సాహితి పెద్దింటి
బహిష్కరణ - ఇంద్రపాల శ్రీనివాస్
కవిత్వంలో వాతావరణం...- జి. లక్ష్మీనరసయ్య (వ్యాసం)
లొకేషన్ - (అ) మందరపు హైమవతి
చిత్రప్రదర్శన - కాశిరాజు లక్ష్మీనారాయణ
పరిమళకృష్ణ - దేవిప్రియ
ఇదిగో మాట - జి. లక్ష్మీనరసయ్య
బతుకు మందారం - మామిడి కోదండరామ్
నేను - చెంగల్వ బొడ్డపాటి రామలక్ష్మి
కవి - సబ్బని లక్ష్మీనారాయణ
రా...ప్రియా ..! - జనజ్వాల
నిరంతర ప్రవాహం...
గోపి కవిత్వం - బండ్ల మాధవరావు
మర్మ ఊపిరి....
తుఫాను నిట్టూర్పు - నామాడి శ్రీధర్

హేవిళంబికి స్వాగతం...

కాలం నిరంతర ప్రవాహం.
ఎక్కడా ఒక్కక్షణం విశ్రమించకుండా
ప్రవహిస్తూనే వుంది.
దుర్ముఖి వెళ్ళి హేవిళంబి వస్తోంది.

మళ్ళీ కొత్త ఆశలు, ఆలోచనలు, కొత్త గమ్యాల నిర్దేశనం మనసులోకి చొరబడుతూ వుంది. షడ్రుచుల ఉగాది పచ్చడి, మావిచిగుళ్ళు, వేపపూత, కోయిల గొంతుల సంభాషణలు ఎలా వున్నా కవులకు మాత్రం ఈ ఉగాది నూతన సందేశాలను అందిస్తూనే వుంది. తెలుగు రాష్ట్రాలు రెండుగా అయ్యాక వస్తున్న మూడో ఉగాది ఇది. ఉమ్మడి రాష్ట్రంగా వున్నప్పటి కంటే రెండుగా విడివడ్డాక సాహిత్య సాంస్కృతిక సంబరాలు రెండు రాష్ట్రాల్లోనూ ఆకాశాన్నంటేలా జరుగుతూనే వున్నాయి. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమం జరుగుతున్న కాలాన ఆంధ్రప్రాంతంలో సాహిత్య సాంస్కృతిక పరమైన స్తబ్ధత నెలకొని వుండేది. తెలంగాణ అంతటా సభలూ సమావేశాలు కోలాహలం చెలరేగుతున్నప్పటికి ఇక్కడ పెద్దగా చలనం వుండేది కాదు. ఇప్పుడు పలమనేరు నుంచి పార్వతీపురం వరకు ఏదో ఒక విధమైన సాహిత్య సాంస్కృతిక సభలు జరుగుతూనే వున్నాయి.

అయితే అవి ఏ దిశగా జరుగుతున్నాయనేదే చర్చించాల్సిన అంశం. ప్రభుత్వాలు భాషా సాంస్కృతిక విధాన ప్రకటన చేయకుండానే తమకు తోచిన పద్ధతిలో జాతరలు ఓ ప్రక్క జరుపుతూనే మరో పక్క మాతృభాషలో విద్యాబోధన, అధికార భాషగా తెలుగు అమలు వంటి అంశాలను కాలరాచే ప్రయత్నాలు చేస్తూనే వున్నాయి. భాషా సంస్కృతుల పట్ల ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన వాగ్ధానాల అమలు ఏ స్థాయిలో వుందో పరిశీలిస్తే చాలు భాషపట్ల ప్రభుత్వ వైఖరి అవగతం అవుతుంది.

వ్యక్తులు సంస్థలు చేసే సేవ రెండు రాష్ట్రాల్లోనూ ఇతోధికంగా జరుగుతూనే వుంది. అయితే విశ్వవిద్యాలయాల స్థాయిలో జరగాల్సిన పరిశోధన దాదాపుగా నిలిచిపోయిందనే చెప్పాలి.

ఇటువంటి అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఒక స్పష్టమైన విధానాన్నే అమలు చేస్తేనే తెలుగు భాషా సంస్కృతులు పదికాలాల పాటు పరిఢవిల్లగలిగేది. ■

పరాయీకరణ తర్కం

బీబీజి తిలక్ 98915 87654

పొగ నిప్పుకు సూచకం కాదు
నిప్పు లేకుండా పొగ సాధ్యమే
పొగ మంచు పొగా కాదు మంచూ కాదు
కాగితప్పడవలు నీటికి సూచకం కానక్కరలేదు
గాలిలో దీపాలు ఆరిపోనక్కర లేదు
గాలిలో దీపాలు కాగితప్పడవలు కాదు
కాగితప్పడవలు పడవలే కాదు

సినిమా హీరోలు మావోయిస్టులు కాదు
మహేష్ బాబు వర్గ శత్రు నిర్మూలన చెయ్యడు
అందంగా కనిపిస్తాడు ఉత్సాహంగా చంపుతాడు
మహేష్ బాబు చంపడం నిజం కాదు
మహేష్‌బాబు ఉత్సాహంగా చంపడం అబద్ధం కాదు

నిజం అబద్ధం కాదు
అబద్ధం నిజం కాదు
కాల్పులు వేరు బూటకపు యెదురు కాల్పులు వేరు
పోలీసులు వేరు సినిమా హీరోలు వేరు
సినిమా హీరోలు వేరు మావోయిస్టులు వేరు
హింస వేరు ప్రతి హింస వేరు

తాడు పాము కాదు, పామూ తాడు కాదు
సినిమా చూడటం వేరు చూపించడం వేరు
చూడ్డాన్ని చూపించటం వేరు
చూపించడాన్ని చూడ్డం వేరు

హింస వేరు చిత్ర హింస వేరు

మావోయిస్టులు సినిమా హీరోలు కాదు
కాగితప్పడవలు పడవలే కాదు
మావోయిస్టులు వేరు సినిమా హీరోలు వేరు

కొండమీది కార్తీక దీపం కొండెక్కదు
అవునూ : దీపాన్ని కొండెక్కించిందెవరు?

జనం విష్ణుమాయలో వుండరు
జనం వేరు విష్ణుమాయ వేరు
జనం వేరు మనం వేరు
జనం మావోయిస్టులు కాదు
సినిమా వేరు శత్రు సంహారం వేరు
హీరో వేరు విలన్ వేరు సినిమా హీరో వేరు
సినిమా హీరో హాల్లోనే కొడతాడు
బయటకి వస్తే హీరోకి జనం విలన్‌లవుతారు

కాల్పులు వేరు ఎదురు కాల్పులు వేరు
జనం వేరు సినిమా హీరోలు వేరు
మావోయిస్టులు వేరు కాగితప్పడవలు వేరు
విప్లవం వేరు విప్లవ తంత్రం వేరు
నీతి వేరు ద్రోహం వేరు
దీపాలు వేరు పాపాలు వేరు
దీపాలు చీకట్లను తరిమేసే పుణ్యాలు ■

(యస్. ఆర్. శంకరన్, డా. కె. బాలగోపాల్,
కె. జి. కన్నాభిరన్ల స్మృతికి)



1,1,1...2,2,2...3,3,3...

మేడక యుగంధరరావు 9032056738

ఎక్కడికో ఎందుకు?
ఇక్కడికే రండి
గొంతు తడపని
ఎండమావుల వద్దకే
ఆబగా కాళ్ళీడ్చుకు రండి
మీ బంగారాల్ని
ఐ.ఐ.టీ నో,డాక్టర్నో
విరిగిపడుతున్న
మంచు శకలాలేవైనా
అలా ఒంటి చేత్తో ఒడిసిపట్టి
సిరాచుక్క ఇంకని
విస్రుాళ్ళను చేసేస్తాం

వెలుతురు బిరడా బిగించి
ఊపిరి కొస కోసం పాకులాడే
కోళ్ళఫారాల తరగతిగదుల్లో
మీ బుజ్జాయిల్ని పిండారబోస్తాం
కాదూ కూడదంటే
పురాతన గాయాల్ని కప్పుకొన్న
నల్లబల్లమీది పచ్చికబయళ్ళను
ఎడారినేలలో కాలబెట్టేసి
లేలేత దేహాలను
మార్కుల ఏవరేజిలో చిత్రికపట్టేస్తాం

ప్రకటనల బెల్లపుఊటలో
గిజగిజకొట్టుకుంటున్న
ప్రియమైన తల్లిదండ్రులారా!
ఎక్కడికో ఎందుకు?
ఇక్కడికే రండి
రెక్కలు చాపుతున్న తూనీగల కోసం
కొత్త కొత్త పంజరాలను సిద్ధం చేశాం

1,1,1...2,2,2...3,3,3...

ఫ్యాను రెక్కకు
విద్యార్థి వేలాడుతున్నాడు. ■

నా దేశానికి ఇపుడే కొత్తకాంతులు

పరాంకుశ నాగరాజు 99634 60211

బానిస దాస్యం వీడి ఆరుపదులైనా...
నాదేశానికి ఇపుడే కొత్త స్వేచ్ఛ లభించింది
రుధిరంలో మానవత్వాన్ని
సశ్యామలతో పాడిపంటల్ని పండిస్తూ
ధవళస్వేచ్ఛాకపోతాలు
నింగినుండి పయనిస్తున్నాయి
చెత్తరాజకీయాలను కడిగేసేందుకు
చీపురుపట్టిన నేతలొచ్చారు
మీసేవలో మేమున్నామంటూ...
ఎదగలేని దేశాన్ని సాంకేతిక విప్లవంతో
మంగళయానం జరిపించిన శాస్త్రవేత్తలు
చందమామ నుంచి బృహస్పతి వరకు
దిశానిర్దేశం చేస్తున్న పయనాలు
నాదేశ బలప్రతిష్టలు చాటుతోంది
కొత్తకాంతుల నాదేశంలో
త్యాగానికి ప్రతీకలైన హనుమంతప్పలు
సాహసప్రతీక యురి సేనలు
మా గుండెల్ని హర్షాతిరేకంతో నింపుతున్నారు.

సరిహద్దుల్లో గడ్డకట్టించే చలిగాలుల్లో
కొండల అంచుల్లో... కోనలకోరల్లో
శిలలా నిలబడిన భారత జవాన్ల సేవలతో
మాగుండెలు కృతజ్ఞతతో నిండుతున్నాయి

చొరబాటుదార్లకు చొరవగా బుద్ధిచెప్పిన ధైర్యం
అతిక్రమిస్తే.. ఆగ్రహం రుచి చూపించే తెగువ
నిర్భయంగా ప్రదర్శిస్తూ... రగలిపోతున్న సేనలతో
నాదేశాకిపుడే కొత్తకాంతులొస్తున్నాయి. ■

ఐడెంటిటి

ఉదయమిత్ర

సెజ్ ల చెట్టుకుపూసిన అందమైన పూలుమీరు
దానివేర్లుమాత్రం మాగుండెల్లోకి దిగబడ్డాయి

మీరట్లా హూందాగ
నడుచుకుంటూ పోతారా
పచ్చని బతుకిచ్చిన మాపొలాలన్నీ
మాకళ్ళముందునుంచె
నడుచుకుంటూ పోయినట్లుంటది

మీరట్లా హుషారుగ కంపెనీ బస్సెక్కుతుంటె
మమ్మల్ని పెడరెక్కలవిరిచికట్టి
పోలీసువ్యాన్లల్ల కుదేసిందె యాదికొస్తది

మీగులాబీ బుగ్గలపిల్లలు
గునగున నడిచివొస్తుంటె
ఏడ్చిఏడ్చిన మాపిల్లలమురికిబుగ్గలమీద
జాల్వారిన కన్నీటిచారికలె మెదుల్తయి

మీరుఘనమైన
పుట్టినరోజులు జరుపుకుంటుంటె
మేం గుండెపగిలి శవాలైతె
బొందపెట్టజాగలేని
పాడురోజులె గుర్తుకొస్తయి

ఎంతయినా
మా ఐడెంటిటి రద్దయినాంకనెగదా
మీఐడెంటిటి మొదలయ్యేది

ఎంతయినా
మా మెడల ఉరితాళ్ళుపడ్డాంకనెగదా
మీమెడల సగర్వంగ
ఐడెంటిటికార్డు వేలాడేది ■

రాత్రి తేలు

అనువాదం : మొయిద శ్రీనివాసరావు 9908256267
ఆంగ్ల మూలం : Nissim Ezekiel

నాకు గుర్తుంది
ఆ రాత్రి...మా అమ్మని తేలు కుట్టింది
పొద్దుటి నుండి
వర్షం కురుస్తుండటం వలన
తేలు...
బియ్యం మూట కిందకి వచ్చి చేరింది
కుట్టాక అది
(చీకటి గదిలో మెరిసే భయంకరమైన తోకతో)
తిరిగి వర్షంలోకి వెళ్ళిపోయింది
ఇరుగుపొరుగు వారు ఈగల్లా మూగారు
నొప్పి తగ్గడానికై
పదే పదే దేవుణ్ణి తలిచారు
మట్టి గోడలలో... తేలుకై
వెలిగే దీపాలతో వెతికారు
కనబడకపోయేసరికి... పెదవి విరిచారు
తేలు కదలకుండా
ఎక్కడో వుండవచ్చునని
దాని ప్రతికదలిక
మా అమ్మ రక్తంలోకి.. విషం
చురుకుగా కదిలేలా చేస్తుందన్నారు
ఈ రాత్రికి... మా అమ్మ
గత జన్మ పాపాలు పోవచ్చునని
వచ్చే జన్మపు కష్టాలు తగ్గవచ్చునని
మా అమ్మ భరిస్తున్న బాధ
ఈ మాయా ప్రపంచంలో
ఆమె పాప పుణ్యాలను సరిచేయవచ్చునన్నారు
విషం... బహుశా
మా అమ్మ కోర్కెల దేహాన్ని...
ఆశల ఆత్మను
పరిశుద్ధం చేయవచ్చునన్నారు
చాపపై... బాధతో మూలుగుతున్న
మా అమ్మ చుట్టూ... అందరూ
ఏదో బోధపడిన వారికి మల్లే
మొహాలు పెట్టి కూర్చున్నారు
మరిన్ని దీపాలు
మరిన్ని కీటకాలు
మరింతమంది మనుషులు వచ్చి చేరారు
ఆగకుండా వర్షం కురుస్తూనే వుంది
తార్కికుడు నాస్తికుడైన మా నాన్న
కంటికి కనిపించిన ప్రతి చూర్ణాన్ని
మూలికల మిశ్రమాన్ని
మా అమ్మ పాదంపై ఉంచాడు
చివరికి తేలు కుట్టిన చోట
మైనం ముద్దను పెట్టి మంట పెట్టాడు
మా అమ్మని తినేసేలా
మంట కాసేపు కాలుపై నిలవడం చూసాను
విషం విరుగుడుకై మంత్రాలను వల్లిస్తూ
ఓ క్రతువు జరగడం గమనించాను
ఓ దినం గడిచింది నొప్పి తగ్గింది
తేలు నన్ను కుట్టి
నా పిల్లలను వదిలిపెట్టినందుకు
దేవుడా నీకు దండాలని
మా అమ్మ అంది ■

జమీల్యా

కవిత కట్ట 95531 26534

జమీల్యా... ఓ జమీల్యా...
అందరికీ గ్లాసీ లుక్సే కావాలిప్పుడు
అంతకన్న సున్నితమయిన మనసు ఎందుకు?
అందులోని బరువయిన భావాలెందుకు?

ఆశల ప్రవాహం పక్కన గడ్డిపూల కోసం
తుమ్మిష్కలా తిరుగుతున్నవా?
సైప్ మైదానాల్లో ధనియార్ కోసం
కాచుకుని కూర్చున్నావా?

వెదుకు...
భూమిని చీల్చుతూ కొత్త సాళ్ళు పోసే
నాగలి పట్టుకునో...
ఇప్ప పూలతో పరిమళించే వనాలున్న
చోటనో...
పరుల పొట్టగొట్టని అమాయక గిరిజనుల
తరఫునో నినాదమవుతూనో...
కనిపిస్తాడు!

ఒక్కసారి నిన్ను కమ్మేసిన వర్చువల్ తెరని
తొలగించి చూడు...

ఎర్రదుబ్బులపై రేలా, తుమ్మ కలిసిన
పసుపు గంధం పరిమళం...
వరి కంకుల మీదుగా వచ్చిన పైరగాలి తాకి
ముఖంపై తారాడే ముంగురులు...
బురద మడిలో నానిన పాదానికి
పదునుగా తాకిన పలుగు రాయి...
పడమటన పొద్దుగూకుతుండగా
వెలుగు రేఖలు తాకిన నల్లని దేహానికి
బంగారు వన్నె మెరుపు...

ఇంకేం కావాలి జీవితానికి...
కల్మషం లేని పరిమళం
కాలుష్యం లేని పవనం
ఊహించని స్పర్శ

ఈ జీవిత గమనానికి
నువ్వు తానూ
వలపట దాపట ■

నీవే మంచోడివి !

జక్కన్న 9985727509

నిన్నెంతగనో ఇష్టపడితిని
నీపైనే ఆశలు పెట్టుకొంటిని

నన్ను రవంతైనా ఇష్టపడకపోతివి
మోసం చేస్తివి

అష్టకష్టాల పాలు పోసి
నన్ను పెంచుకొంటివి

తిట్లు తిని, తన్నులు తిని
నా కడుపు నింపితివి

సన్నగ్గిలాచ తోసేస్తివి
అది నాచలినైనా తీర్చలేదు

దానికన్నా నీ చల్లని చూపుకే
బూడిదైపోతా – వెలుగైపోతా

ఎట్లాగైనా నన్నే గెలిపిస్తావు
నీవే మంచోడివి ! ■

వాక్యూమ్

బేతా రామసూర్య ప్రకాశరావు 94412 90321

దిక్కులు పిక్కటిల్లేలా
అరచిన నా అరుపు
ఎవరికి వినపడుతుంది!
ఎవరి దారి వారిది.

పంకజలంలో
పరిగలను ఏరుకుంటూనో..
గట్టు కింద
నత్తలను పోగుచేసుకుంటూనో!
ఎవరిగోల వారిది.

నా పిచ్చిగాని..
బండ మీద నిలబడ్డ
నాకు
దిక్కు లెక్కడివి?
ఏ దిక్కు నాదిక్కు!

అరచిన అరుపు
అయెనోస్ఫియర్లో కలసి పోతుంది.
తిరిగి తిరిగి
నా చెవిలోనే మోగుతుంది

వేదన.. రోదన..
గొయ్యి తవ్వి.
లోతుగా...
ఊదాలని పిస్తుంది.
గట్టిగా..
నెట్టాలని పిస్తుంది.

ఏం?
రాతి పొరల్ని
చీల్చు కుంటూ..
చొచ్చు కుంటూ
ఆవలి వానికి
నా అరుపు వినపడదా?

స్టోన్ ఈజ్ నాట్ ఎ బాడ్ కండక్టర్!
అందుకే రాతి గుండె అంటారు!
వాక్యూమ్ లో..
చెవులు దిబ్బడేసుకుంటాయి.
ఆర్తనాదాలకు
సైలెన్సర్లు బిగుసుకుంటాయి.

అసలు
కాంటాక్ట్టే లేని యుగంలో..
కమ్యూని కేషన్స్ ఎలా?
గొంతే లేనపుడు
అరుపెక్కడ? ■

ద్రవ స్థితి

ఎం.కె. సుగమ్‌బాబు 80966 15202

ఆగకుండా ఎక్కిళ్ళు వస్తుంటే
మరో ముద్ద మింగితే
గొంతు దిగుతుందా?
నీళ్ళే తాగాలి -

మనిషి కూడా ఎప్పుడూ
నీళ్ళలాగే
ద్రవస్థితిలోనే ఉండాలి...
అప్పుడు
ఏరూపమైనా ఎత్తొచ్చు
ఎవరి దాహమైనా తీర్చొచ్చు ! ■

తిరిగి చిగురించాలని

జన్నతుల్ ఫిరదౌజ్ బేగం 9505961150

నువ్వు అనుకుంటున్నట్లు
మేమిప్పుడు అక్కడ లేము
కాలంతోపాటు
ప్రవహించటం నేర్చుకుని
నిన్నటి స్వప్నాల్ని అక్కడే వదిలిపెట్టి
కొన్ని జ్ఞాపకాల్ని మాత్రం వెంటతెచ్చుకున్నాం

అక్కడ నది ఒడ్డున మా ఇల్లు ఉండేది
చెట్లకి కలలపూలు పుష్పించేవి
బంగారు రథాన్నెక్కిన సూర్యుడు
రాత్రిని కరిగించి
పగటిని కాన్కగా ఇచ్చేవాడు
పుస్తకం పట్టుకొని చెట్టుకింద కూర్చుంటే
పక్షులు ప్రేమని కుమ్మరించి నవ్వేవి
కొండమీద నుంచి అడవి పూల సుగంధం
నది కొంగును పట్టుకొని
రివ్వున ఇంట్లోకి పరిగెట్టి
మనసుని గాఢంగా హత్తుకునేది
గుడిగంటల శబ్ద సంగీతం
ఐదుసార్లు కాలాన్ని ఖచ్చితంగా తెలిపే
మసీదు గొంతుక లోని 'అజా'
ఆదివారం ఉదయం ఆత్మీయ వాక్యాల్ని
ప్రేమతో వెదజల్లే పాస్టరు గొంతుకా
ప్రవాహంలో కొట్టుకుపోయిన జ్ఞాపకాలయ్యాయి
నువ్వనుకుంటున్నట్లు మేమక్కడలేం...
ఇప్పుడు మేము ఆ ఊరిని వదిలి
మబ్బుల తడిలేని
ఆకాశపు గొడుగు కింద చేరాం
నడుస్తున్న దారులవెంట
మనిషి పరిమళం కోసం
ప్రవహించటం చేతకాని ప్రపంచంలో
ఎప్పటినుంచో
నిస్సిగ్గుగా వెతుకుతూనే ఉన్నాం
ఇప్పుడు మా గొంతుకల్లోంచి
సజీవమయిన పాట ఒకటి తప్పిపోయింది
మా కళ్ళలోంచి పొలాల పచ్చదనం
పుస్తెలు తెంపుకొని
ఎక్కడో ఖననమై పోయింది
ఎందుకనో ఏమో చెప్పలేను గానీ
రెండు పడగ్గదుల
జీవనంలేని అపార్టుమెంటు
కాంక్రీటు సౌధాన్ని కలగని
రోజూ కన్నీటితో

గ్రానైటు రాళ్ళని శుభ్రపరుస్తున్నాం

చిగురించాలని
రోజూ ప్రయత్నిస్తున్నప్పటికీ
విత్తనాలు మొలవని ఈ కాంక్రీటు వనం
రెప్పల క్రింది దుఃఖానికి కూడా
రహస్యంగా ఆనకట్ట కట్టేసింది
నడుస్తున్న ఈ కాలానికి
ఓసారి నమస్కరించి
ముక్కలైపోయిన మా స్వప్నాల్ని
తిరిగివ్వమని ప్రాధేయపడాలని ఉంది
అప్పటి మనుషుల్లా
తిరిగి చిగురించాలని కోరికగా వుంది.■

బానిస కల

మూలం : ఎచ్ డబ్ల్యు లాంగ్‌ఫెలో
అనువాదం : మందలపర్తి కిషోర్

మట్టిపాలయిన బియ్యం గింజలకు
పెడగా పడివున్నాడతగాడు.
చొక్కా కూడా లేదు కానీ చేతిలో మాత్రం కొడవలి!
జడలు కట్టిన జుట్టు
ఇసుకలో కూరుకుపోయి వుంది.
మరుపు-చెరుపుగా ఉన్న స్థితిలో
మరోసారి, తన స్వస్థలం గురించి కలగన్నాడతను
సువిశాల స్వప్నసీమలో నిగర్ నది
రాజసంతో ప్రవహిస్తూ కనిపించింది !
మైదానాల్లోని ఖర్జూరపు చెట్ల నీడల్లో
రాజల్లే స్వారీ చేసుకుంటూ సాగిపోయాడతను.
గణగణమంటూ, కొండదారుల్లోంచి
దిగుతున్న బిడారుల గంటలు -
సంతానాన్ని వెంటపెట్టుకుని,
అతని రాణి మరోసారి దర్శనమిచ్చింది
అతని మెడను వాటేసుకుని, బుగ్గల్ని ముద్దాడి
చెయ్యిపట్టుకుని వదల్లేదు భార్యా బిడ్డలు
బానిస కనురెప్పల్ని చీల్చుకు ఉబికిన
ఓ కన్నీటి చుక్క ఇసుకలో ఇంకిపోయింది!
నిగర్ నదీ తీరం వెంబడే రివ్వున దూసుకుపోతున్న
అతని చేతుల్లో బంగారపు గుర్రపు కళ్లెం;
అడుగడుగునా అతగాడి ఉక్కు ఒర
పోతుగుర్రం డొక్కలకు తట్టుకుంటూ పోయింది.
అతనికి ముందుగా,
ఎగరేసిన ఎర్రని జెండాల్లా
ఎర్రముక్కు గూడ కొంగలు!
చింతల తోపులతో నిండిన
మైదానాలను చీల్చుకుంటూ,
నల్లవాళ్ళ చుట్టుగుడిసెల కప్పులు కనిపించే వరకూ,
ఎగసిపడే మహార్ణవం కళ్ళబడేంత వరకూ,
పొద్దుపొడిచి, గడిచే వరకూ,
అతగాడు ఎర్రముక్కు కొంగల్నే అనుసరించిపోయాడు;
అర్థరాత్రి అతగాడికి సింహగర్జన వినిపించింది !
ఎక్కడో దుమ్ముల గొండి వికవికమంది -
గుట్టుగా సాగే ఏటిగట్టు మీది తుంగమొక్కల్ని
ఎడాపెడా తొక్కుకుంటూ
నీటిగుర్రం తన భారీకాయాన్ని
దొర్లించుకుపోయిన సడి -
అతగాడి కలల ఊరేగింపు కడదాకా సాగిన
తుడుం మోతలా ఉందది!
వేనవేల భాషలు పలికే అడవులు
విమోచన నినాదాలు వినిపించాయి !
విముక్తమూ, ప్రాకృతమూ అయిన కంఠస్వరంలో
ఎడారి పేలుడు
చెవులు బద్దలు కొడుతూ విరుచుకుపడింది
ఉరుములాంటి ఆ వికటాట్టహాసం వినడంతోనే
అతని యాత్ర మొదలయింది.
పెదాలపై చిరునవ్వు అలుముకుంది !
అతని ఒంటిమీద ఛెళ్లుమన్న
జట్కా వాడి కొరడా అతన్ని తాకనేలేదు -
మాడ్చే మిట్టమధ్యాహ్నపు వేడి
అతనికి సోకనే లేదు!
ఎందుకంటే,
అప్పటికే మృత్యువు సుషుప్త సీమను
కాంతిమంతం కావించింది !
ఆత్మ, పగలగొట్టి
పారిపోయిన పంజరంగా మారి,
అతగాడి నిర్జీవ దేహం అక్కడ పడివుంది ! ■

నది గోడపై

శైలజామిత్ర 9290900879

ఉదయించడం
అస్తమించడం సూర్యుని విధి
మనసు బొమ్మ నీడలో ఉంది..

నడుస్తున్నంతసేపూ
నన్ను కదలనీకుండా చేసింది
చల్లని గాలి వీస్తూనే ఉంది

ఒక్క రాత్రేంటి..
పగలు కూడా అదే కల కన్నది
నాలోని ప్రవాహం నదిలా మారింది

దేహంపై పూలదండ వాలింది
నీటి బొమ్మ మసకబారింది
వాస్తవ సంభాషణను దేశం వింటోంది

కొన్ని మొక్కలు
కొన్ని గింజలు
కలగలిసిన రూపంలో ఆకాశం కనిపిస్తోంది
నేనంటే నేనని
హృదయం దుస్తులను తోసేస్తోంది

జీవన చిత్రం గాలివానకు చిక్కినట్లు
ఆశలన్నీ ఆశనిపాతాలుగా మారి
గుమ్మడి పువ్వులై గుమ్మంలో నిలుస్తుంటే
పరుగుల పందిరి కరిగిపోతోంది

ఏం చెయ్యను?
ఉదయం వచ్చిన వర్షం
నా కళ్ళని నింపుతుంది
రాత్రి వచ్చిన గాలి
గుండె స్పందనను ఆపుతుంది.. ■

జ్ఞాపకమై

సుపర్ణ మహి 89199 99461

...చలిపొర కరిగించుకుంటున్న తన్మయతలో
నిన్న దుమ్మో పచ్చి జ్ఞాపకం...
లేత ఎండ కౌగిలింతలో మేను వాల్చిన వీధి అరుగు
వొళ్లంతా పారుతూ ఒకటే నున్నని మెఱుపు...

నిన్న రాత్రి చీకటి ని
తనముందే పుట్టడం చూసాయి,
తన ముందే కరగడం చూసాయి,
ఇంకా ఆర్పని వీధి దీపాలు లేత ఉదయం
ముంగిట ఓ ఫిలోసోఫికెల్ కెటలిస్టులు...

ఎటెళ్ళిందో, ఏమైందో, తనువు
అణువణువూ ముక్కలై ముగ్గు కళ్ళాపి ఆత్మలో
సోహం అని కరిగిపోయిందో...
పుటల్లేవూ, తిరగేసి చూసే పాఠాల్లేవూ,
వాకిట్లో పుస్తకం రోజూ ఓపిగ్గా
రాసుకుపోవడమే...

ఎన్ని వేల నిశి వెల్లువలెల్లిపోయాయో
ఈ ఉదయం వీపెనకాల్నుంచి
అనంతానంత శూన్యంలోకి...
నేనే, నువ్వనే నీ నేనే...
ఎవరుంటారు ఇంతగా మరి,
తలుచుకోవడానికి పదే, పదే...

లోపల జ్ఞాపకాల పటం ముందు
సాగిలపడీ,
నిలబడీ,
నిన్నై నువ్వై
నేను నామేను కాలేక... ■

పురాజ్ఞాపకం

తోట శ్రీనివాసరావు 89770 66980

ఎప్పుడు కనుమరుగయ్యావో నువ్వు
జ్ఞాపకం రావటంలేదు !
క్రైం స్టోరీలు, కత్తియుద్ధాలు
వెండితెరపై
ఇష్టంగా వీక్షిస్తున్న కాలంలోనా?
సైకిల్ చక్రాలు రెండూ
నల్లని తారురోడ్డుపై నాగుపాములై
జారిపోయిన వసంతంలోనా
ఎప్పుడో గుర్తుకురావటంలేదు !
ఒంటరి పుస్తకాల్లో,
కీకారణ్యపు గదిలో
ఎన్ని పగళ్ళో !
కవ్వించి, లాలించి, జోకొట్టే
విస్కీ బాటిళ్ళతో ఎన్ని రాత్రులో !
చాలాకాలం మానసిక చికిత్సా కేంద్రంలో
విహారం సల్పి
ఇప్పుడే మెరమెరల స్పృహలోకి వచ్చాను గదా!
ఎప్పుడు కనుమరుగయ్యావో
ఎంతకీ గుర్తుకు రావటం లేదు ?!
ఏ చినుకులు నేలపై ధారలు, ధారలై
కురిసిన కార్తెలోనో
ఏ ఎండలు మంటలై మండి రోడ్లను
వేడి పెనాలుగా కాల్చిన కర్తరిలోనో
కనుమరుగయ్యుంటావ్
అచ్చం ఆ ముఖంలానే వుంది
ఆ నవ్వేదో
బాగా పరిచయమున్నట్లే వుంది
ఆ లావు, ఆ కట్టూ, ఆ బొట్టూ చూస్తుంటే
అచ్చే! నువ్వు కానట్లే వుంది
ఏమో, ఇంతకూ
ఒక 'నువ్వు' నకలు మాత్రం
నా జ్ఞాపకాల్లో
అస్పష్టంగా, దుమ్ము పేరుకుని
బ్లాక్ అండ్ వైట్ ఫొటోలా
ఇంకా అలాగే వుంది ! ■

అదృశ్యదృశ్యం

అరుణ్‌బవేరా 94407 10678

నేనొక యాంత్రతగా నడిచే
ఒంటరి దుఃఖంలో –
నాలో క్రిక్కిరిసిన
వేనవేల ఆత్మలు స్వేచ్ఛ కోరుతున్నాయి
బాటసారులు ఆకలిగా సొమ్మసిల్లే
మధ్యాహ్నపు టెండ
నన్ను కొరుక్కుతింటోంది...
– ఒక పచ్చని కౌగిలి కోసం
వెతుకాడి అలసటగా
మూర్ఛపోతున్నాను...
రోడ్డు పక్క నీడలు చెదలుపడుతున్నాయి...
నా దాహంలో దేహం తేలిపోతోంది...
నది – వేడి ఇసుక లాగు
వేళ్ళ మధ్యలోంచి రాలిపోతోంది...
ఆకాశం – ఏ ఎండిన
చెట్టుకొమ్మకో వేళ్లాడుతుంది
అడవి ఒక దృశ్యంగా
అదృశ్యమయ్యే సన్నివేశంలో
వాన – ఒక తెగిన జ్ఞాపకం ■

వేకువ తీరాన...

పక్కి రవీంద్రనాథ్

సందడి చల్లారింది
తలుపులు పెనవేసుకున్నాయి
ఎయిర్ కండీషనర్ శీతల పరిమళమై
గదంతా వ్యాపించింది
దీపం రెప్పవాల్చింది.

ఒంటరితనాన్ని కప్పుకున్నాను.
జ్ఞాపకాలు కుట్టడం మొదలుపెట్టాయి
మగత రానని మారాం చేస్తోంది.
నిశ్శబ్దపు రొద
లేచి కూర్చున్న చెవులు
గడియారపు ముళ్ళు
ఒకటే కబుర్లు
కుంటిదయిన కాలం
ఒంటిపై పాకుతున్న అసహనం
ఆవలింతలు ఆహ్వానిస్తున్నా
నిద్ర నిద్రను నటిస్తోంది.
నా కింద పరుపు మెత్తగా
అచ్చం కొండచిలువ దేహంలా
దిండు దిశలు మార్చుకుంటోంది.
దూరంగా రైలు కూసింది.
రంగుల రెక్కలాడిస్తూ బాల్యం వాలింది.
పొత్తిళ్ళలో పొదివిపట్టుకుని
నాచే వెన్నెల త్రాగిస్తూ అమ్మ,
ఉక్కపోతకే ఊపిరాడనీయకుండా
విజ్ఞాన వింజామరలు వీస్తూ నాన్న.
రామదాసును శ్రుతిచేసుకుంటూ
రాత్రుళ్ళను రాగరంజితం చేస్తూ తాతయ్య
కథల రాశులు పోసో
కళ్ళకు లేపనం పూసో
అతల, వితల, సుతల
తలాతల, సువర్లోకాలను
ఆవిష్కరిస్తూ నాన్నమ్మ.
నన్ను జోలగుర్రమెక్కించి
చీకటి మబ్బులు దాటించి
కలలలోకంలోకి నడిపించిన నిన్నటితరం
గుక్కపట్టి ఏడ్చినప్పుడు
నన్ను ఊరడించిన అమృత స్వరం.
పూతోటలో పసితనం ఊరేగిన జాడలు
పట్టుకుందామంటే
ఎగిరిపోతున్న సీతాకోకచిలుకలు.
గుండె కాగితం మీద ఎన్నటికీ చెరగని
నిన్నటి చేవ్రాలు.
కీచురాళ్ళ కచేరీతో
నాముందు వర్తమానం ఒళ్ళు విరుచుకుంది.
గది నన్ను నిద్రలేని కళ్ళతో చూసింది.
చీకటి గుట్టలోనుంచి మిణుగురొకటి
నాన్నపటం ముందు వాలింది.
అల్మారాలోంచి నవ్వుతూ నాన్న
పుస్తక బాహువులతో
నన్ను చేరబిలిచాడు.
విశాల విశ్వాన్ని తెరిచే
తాళపుచెవులను నా చేతుల్లో వుంచాడు.
తూరుపు గూటిలో వెలుతురు కూసింది.
వేకువ కువ కువలతో
రాత్రి తోక ముడిచింది. ■

ఆచార్య రిషబ్‌దేవ్ శర్మ ఈ మధ్యనే హైదరాబాద్ లోని దక్షిణ భారత ప్రచార సభ సంస్థ నుంచి పదవీ విరమణ చేసారు. మంచి కవి, విమర్శకులు, స్నేహశీలి. అన్నిటికన్నా ముఖ్యంగా తెలుగు వారంటే ప్రాణం పెడతారు. రచయితలకు తమ అనువాదాలు ఇతర భాషల వారికి చేర్చాలని వుంటుంది, శంఖంలో పోస్తే గాని తీర్థం అవదు, మంచి ముందుమాట కావాలి, అలాంటి వారికి 'నేను ఉన్నాను' అంటూ రిషబ్‌దేవ్ ముందుకొచ్చి డా భవానీ దేవి, పెద్దింటి అశోక్ కుమార్, సలీం లాంటి ఎందరో రచయితల పుస్తకాలకు విశ్లేషణాత్మకమైన ఉపోద్ఘాతాలు రాసారు. ఇటీవల రాసిన వారి కవితను తెలుగులోకి శాంత సుందరి అనువదించారు. ఈ కవిత వారి కవిత్వానుభవానికి ఒక మచ్చుతునక.

యుద్ధం సోకని మూడడుగుల నేల

మూలం : ప్రొ. రిషబ్‌దేవ్ శర్మ

అనువాదం : ఆర్.శాంతసుందరి

ఇరవైయొకటో శతాబ్దంలో
మొట్టమొదటి చీకటి రాత్రి
పుట్టాలని చూస్తున్నదొక శిశువు
కానీ ఊరికే బెదిరిపోతోంది
మళ్ళీ వెళ్ళిపోతోంది అదే చీకటి గుహలోకి
అనాది నుంచీ
తను నిద్రిస్తూ ఉండిన చల్లని గర్భంలోకి.
'ఏయ్ !
ఏమిటీ మొండితనం,
ఎందుకంత భయం,
ఎందుకు జన్మించవు నువ్వు?' -
తన నుదుట పట్టిన చెమట తుడుచుకుంటూ
అడిగింది వృద్ధురాలైన భూమి.
అష్టావక్రుడిలాంటి శిశువు
కెవ్వుమని అరిచింది గర్భంలోనుంచి :
'నేను రాను ఈ నరకంలాంటి నీ లోకంలోకి.
నాకిచ్చేందుకు ఏముంది నీవద్ద?
నేను పుట్టానన్న సంబరంతో
ఇంకా కొన్ని కొత్త ఆయుధాలని తయారు
చేస్తావు,
నా భవిష్యత్తు ఛాతీ మీదికి గురిపెట్టి కాలుస్తావు
తుపాకులూ, మెషీన్ గన్ లూ
కొన్ని కొత్త బాంబులూ పేలుస్తావు
రేడియోధార్మిక కిరణాలని కురిపిస్తావు
నా మస్తిష్కంలోని మూల మూల మూలల్లోనూ-
నీ ఈ లోకంలోకి నేను రాను గాక రాను.
రాను...రాను...రానంటే రాను ...!'
ఆ తరవాత పరుచుకుంది నిశ్శబ్దం

ఇంకా పుట్టని ఆ శిశువు నిరాకరణకి
ఎవరి దగ్గరా లేదు సమాధానం.
మళ్ళీ వినిపించింది శిశువు గొంతు
బలి చక్రవర్తి గుమ్మం దగ్గర నిలబడి పిలిచిన
వామనుడి గొంతులా :
'నేను నీ లోకంలోకి రావాలంటే
నాకు మూడడుగుల నేల కావాలి.
కేవలం మూడడుగులే -
స్వచ్ఛమైన, శుభ్రమైన నేల!
ఆ మూడడుగుల నేల మీద
ఎప్పుడూ ఎటువంటి అస్త్ర శస్త్రాల నీడా
పడి ఉండకూడదు.
అక్కడి గాలి పరిశుభ్రంగా ఉండాలి
ప్రకృతి పవిత్రంగా ఉండాలి !'
ఆ గొంతు ఎక్కడో మాయమైంది.
శిశువు మౌనంగా ఉండిపోయాడు
నేలతల్లీ మాట్లాడలేదు
మహారాజులూ, భూపతులూ మౌనం దాల్చారు
ప్రగల్భాలు పలికే భూమిపుత్రులూ మాట్లాడలేదు.
పరిశుభ్రమైన గాలీ,
పవిత్రమైన ప్రకృతితో విలసిల్లే
మూడడుగుల నేల వాళ్ళెవరి దగ్గరా లేదు! ■

దృశ్యావిష్కరణ

జూకంటి జగన్నాథం

ఎన్నోసార్లు చూసాను
చెట్టు ఈసారి కొత్తగా కనిపిస్తుంది

రాలే ఆకులు రాలిపోతున్నాయి
తొడిగే చిగుర్లు పుడుతూనేవున్నాయి
పూచే పూలు పూస్తూనే వున్నాయి
రాలే పువ్వులు నేల వాలుతున్నాయి
చావు పుటుకలు
ఈమారు సరికొత్తగా మాట్లాడుతున్నాయి

నది ప్రవహిస్తుంది
గది నూతన అనుభూతుల్ని ప్రసవిస్తుంది
సూర్యుడు ఉదయిస్తాడు అస్తమిస్తాడు
కిరణం కోసం రాత్రి అలమటించి పోతుంది
చీకటి వెలుగులు
ఈ పరి కొత్త రీతులు తెలుపుతున్నాయి
స్టేజీలో బస్సు ప్రయాణికుల్ని దించినట్టు
కలల దృశ్యాలను కొన్నిటిని
మూసిన కండ్లకు ఇచ్చిపోతాయి
నిద్రలో మెలుకువ అటు నుంచి ఇటు
తిరిగి పడుకుంటుంది
కొన్ని కోకిలల స్వరాలు వరాలవుతాయి

తేపతేపకు దుఃఖం
వేప బతుకంతా జయిస్తుంది. ■

కవితా! చందా 200 రూ॥
డైరెక్ట్‌గా ఎకౌంట్‌లో వేయాలంటే
Visweswara Rao V
Andhra Bank
Eluru Road Branch, Vijayawada - 2
No. 012610100013199
IFS Code : ANDB0000126

ఆమె

ప్రసాదమూర్తి 8499866699

ఆమె
అలల తంత్రులతో మెరిసే వెండి వీణ
ఆ వీణ మీద వేళ్ళలా కదులుతూ ఆకాశాలు-
ఏదో పలకరింపుగా మనం వెళ్తాం
ఆ ఆకాశాలు పాటలు పాటలుగా
మన మీదా మన లోపలా మన చుట్టూ
ధారాపాతంగా కురుస్తాయి

పాటలూ మాటలే కాదు
నవ్వులూ నడకలు కూడా నేర్చిన వీణ
తెలిసిన వాళ్ళం కదా
ఆ వీణ చుట్టూ పక్షుల్లా మూగుతాం
ఆమె గలగలా గలగలా
ఎటు చూస్తే అటు ఒక జలపాతమై కనిపిస్తుంది
మనతో మాట్లాడుతుందో ఏ మన్వంతరాల
మానవ సమూహాలతో మాట్లాడుతుందో
మనం పోల్చుకోలేం

అందరిలానే నేనూ వెళ్ళాను
ఆ వీణ అటూ ఇటూ ఇల్లంతా
సందడిగా తిరుగుతుంటే
జీవితం తాలూకూ లేత వెలుగేదో
నా హృదయాన్ని మెత్తగా తాకింది

ఏదో కొత్త దేశానికి కచేరీ కోసమని
ముస్తాబవుతున్నట్టు ఒకటే హడావుడి
గొంతులో స్వరాలే సర్దుకుంటోందో
ఒంట్లో ఏయే అరలో ఏయే జ్ఞాపకాన్ని
శుభ్రంగా తుడిచి దాచుకుంటోందో
ఊరెళ్తున్నఅమ్మ కాళ్ళకి అడ్డం పడే పిల్లల్లాగా
నిశ్శబ్ద రాగాలేవో ఆమె పాదాలకు
చుట్టుకోవడం చూశాను
బహుశా అవి ఆయన చూపులు కావొచ్చు

కచేరీ కోసం చేసే ప్రయాణంలో
ఎవరైనా గంధర్వులు తారసపడితే
మానవ పరిమళాన్ని ఒక పాటలా వాళ్ళకి
పరిచయం చేస్తుంది కాబోలు

రుతువుకొక్క వేషం మార్చే ప్రపంచానికి
బతుకు పరమార్థం తెలుసో లేదో కాని
ఈ పై పై చర్మాలు రంగులెన్ని మార్చినా
మనసు నిత్య వసంతగానం చెయ్యాలని
కళ్ళప్పగించి తననే చూస్తున్న కాలానికి
మొట్టికాయలు వేసి మరీ ఆమె చెప్తుంది

విశాఖ వెళ్ళి సముద్రాన్ని పలకరించలేదన్న
బెంగ లేదిప్పుడు
కళ్ళ చివర ఆమె నవ్వును
మనసు అంచున ఆమె ధైర్యాన్ని
అద్దుకుని వచ్చాను కదా
నిత్యమూ నా చెవుల్లో అలలు అలలుగా
జీవన సత్యాల సంగీతాలే

మూసిన గుప్పిట రహస్యం తెలియాలే కాని
సముద్రాలెంత..! ■

(తుమ్మల పద్మిని గారి కోసం)

ఏకాంతం

మూలం : షేక్స్‌పియర్

అనువాదం : సాహితి పెద్దింటి

అది ఏకాంతం
ఏ అర్ధరాత్రో
నాకోసం వస్తుంది
పడుకోవడానికి కాదు,
నా పక్కన కూర్చోవడానికి
నేను పడుకున్నట్టు నటిస్తూ
తను ఏం చేస్తుందో గమనిస్తాను
తను నెమ్మదిగా
నా గదిలో
చీకటి తెరలను దించుకుంది
కదలకుండా కూర్చుంటుంది
చివరికి
అలసి సొలసి
తలను వాల్చేస్తుంది
తను అతి పురాతనమైనది.
పోరాటానికే పాఠాలు నేర్పింది
విషాదపు చీకట్ల గుండా
తను అలలు అలలుగా
అసంతృప్తి తీరును తాకింది
అంతా నిశ్శబ్దం...
అయినా నాకెంతో నచ్చింది
మళ్లీ ఆమెని చేరుకోవడానికి
చేతిని అందుకుని
తనవెంట నడవడానికి
కురిసేవరకు ఎదురుచూస్తాను. ■

Translated of Katherine mansfield (1888 -1923) Poem

బహిష్కరణ

ఇంద్రపాల శ్రీనివాస్ 90522 41005

దట్టమైన అడవిలోకి
చిత్తుకాగితమొకటి
తన కన్నతల్లిని వెతుక్కుంటూ...
విపరీతమైన జనాభా మధ్యకి
అనాధల్లా అక్షరాలొచ్చి
పోరాటాల అవసరాన్ని ఆరాతీస్తూ...
ఈ రోజు
ప్రపంచం గుమ్మం ముందర
అంధకారం చెప్పులు విడిచినట్లుంది
ఆకాశాన్ని విచ్చలవిడిగా వినియోగిస్తున్న మానవుణ్ణి
భూగోళం బహిష్కరించే రోజులు
శంషాబాద్‌లో ఫ్లైట్ దిగాయి. ■

డా॥ ప్రసాదమూర్తికి ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు

ఆధునిక కవిత్వానికి ప్రతిష్ఠాత్మక పురస్కారం "ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు - 2016" కోసం ప్రముఖ కవి ప్రసాదమూర్తి కవితా సంపుటి "చేనుగట్టు పియానో" ఎంపికైందని అవార్డు వ్యవస్థాపకులు డా॥ ఉమ్మడిశెట్టి రాధేయ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవార్డు న్యాయనిర్ణేతలుగా డా. పాపినేని శివశంకర్, ఆచార్య బన్న అయిలయ్య, అరసవిల్లి కృష్ణ గారలు వ్యవహరించారు. ఈ అవార్డు ప్రదానసభ జూన్ నెలలో అనంతపురంలో జరుగుతుందని డా॥ రాధేయ తెలియజేశారు.

కవిత్వంలో వాతావరణం వస్తుగతీకరణ

జి. లక్ష్మీనరసయ్య 92465 72073

ఈ మధ్య ఒక కవి మిత్రుడితో మాట్లాడుతున్నప్పుడు ఒక సామాజిక ఘటన మీదనో, ఏదైనా తక్షణ సోషల్ ఇష్యూ మీదనో కవిత రాసేటప్పుడు వస్తున్న సమస్య చర్చలోకొచ్చింది. తొందర తొందరగా కవితను రాసేసి ఫేస్‌బుక్‌లో పెట్టడమో, పత్రికలో ప్రచురింపజేయటమో చేయడం వల్ల కవితా విలువలు తేలిపోవటం ఒక సమస్య. అలా అని నిదానంగా కవితను కొన్నాళ్ళు మాగనిచ్చి, అవసరమయిన చిత్రిక పట్టి బయటికి తీసేలోపు ఏ ఘటన కోసం, ఇష్యూకోసం ఆ కవిత ఉద్దేశితమయ్యిందో అవి పాతబడిపోవడం మరో సమస్య. ఈ సమస్యల్నించి కవులెలా బయటపడతారనే దానిమీద మా సంభాషణ నడిచింది.

ఇందులో భాగంగా కవిత్వ ప్రయోజనం కవితా వస్తువుతో ముడిపడి ఉంటుందా, వస్తువును కవిత్వంగా మలిచే కళా విలువల మీద ఆధారపడి ఉంటుందా అనే చర్చ నడిచింది. ఇక్కడే నేనీ వ్యాసంలో చర్చించబోయే ఇతివృత్తం నాకు లభించింది.

కవి వ్యక్తం చేసే భావాలు రాజకీయ భావాలైనా, తాత్త్విక చింతన సంబంధితమైనవయినా లేక జనరల్ సోషల్ కామెంట్రీ అయినా అవి కవిత్వం కాకుండా చదువరుల మధ్యకి రావడం వల్ల ఏ ప్రయోజనం లేదు. కవి తాను ఏ ప్రయోజనం కోసం కవితని ఉద్దేసిస్తున్నాడో ఆ ప్రయోజనం ఆ కవితలోని ఇంటెన్సిటీ ఆఫ్ ఆర్ట్ వల్లే సాధ్యపడుతుంది. కళా తీవ్రతలోనూ, సృజనాత్మక విలువల్లోనూ నిమిత్తంలేని వట్టి వస్తువు, అది గొప్పదయినా, పాఠకుల మీద ప్రభావాన్నిచూపలేదు.

భావాల పదునుకూ, వస్తువు లోతుకూ అవి కళాత్మకతలోకి ప్రవేశించినాకే ప్రభావం చేయగలిగే స్థితి మెరుగవుతుంది. అలా జరగనప్పుడు అవి నినాదాలుగానో, ఆలోచనలుగానో మిగిలిపోతాయ్. "The excellence of any art is intensity" అని Anna Akhmatova చెప్పినా, "The excellency of art is its intensity, capable of making all disagreeable evaporate" అని Ben Okri అన్నా కవిత్వ శిల్పం కవిత్వం వస్తువుని మరింత లైమ్‌లైట్‌లో పెడుతుందనే సత్యమే వ్యక్తమవుతుంది.

కవి చెప్పదలుచుకున్న విషయ స్వభావానికి అనుగుణమయిన వాతావరణం, టోన్ కళను దాని ఉన్నత స్థాయికి తీసుకెళుతుంది. కొంతమంది కవులు చెప్పే విషయానికీ, చెబుతున్న గొంతుకీ, మధ్య వైరుధ్యం, దూరం కనిపిస్తాయి. అక్కడ కళా తీవ్రత దెబ్బతింటుంది. అభివృద్ధి, అందులో భాగమయిన బిగ్‌డామ్ రాజకీయాలూ, ప్రజల్ని నిర్వాసితుల్ని చేస్తూ, ఆ నిర్వాసిత్వపు విషాదాన్ని రికార్డు చేయబోయిన కవి తన కవితను ఇలా మొదలు పెట్టాడు.

ఇళ్లు ఇంతింత కళ్లేసుకున్న ఇళ్లు
నీలోకి చూస్తున్న ఇళ్లు
ఇళ్ళలోకి చొచ్చుకుపోయిన కళ్లు

ఇళ్లు; ఇన్నిన్ని ముఖాలేసుకున్న ఇళ్లు

అద్దంలో చూసుకుంటున్న ఇళ్లు

ఇలాంటి ప్రారంభం కవితా శైలిలోని, కళాత్మకతలోని చెమక్కును అందిస్తున్న మాట నిజమే కానీ, నిర్వాసిత్వం తాలూకూ సీరియస్ వాతావరణాన్ని అందించలేకపోయింది. కవితంతా పరుచుకున్న అంత్యప్రాసలు ఇతివృత్తపు తీవ్రతకి అడ్డు తగలటం గమనిస్తాం.

వరసలు వరసలుగా ఇళ్ళు

మోరలు సాచిన ఇళ్లు

చేతులు ఎత్తిన ఇళ్లు

....

కథలు కన్నీళ్లూ

కూలిపోతున్న ఇళ్లూ

ఇళ్ళనిండా నీళ్లూ

ఇళ్ళ కళ్ళ నిండా నీళ్లు

లక్షటియ్యంసీల నీళ్లు

ఇలా పరుచుకున్న కవితలోని కళాత్మకత ఎత్తుకున్న విషయానికి అనువయిన మూడ్‌ని క్రియేట్ చెయ్యలేక పోయింది. ఒక రకమయిన శబ్ద డాంబికంలో thought ని మింగివేయగలిగింది. ఇరవై ఒకటో శతాబ్దపు theme ని శ్రీశ్రీ కాలపు form తో ట్రీట్ చేయడమూ ఇక్కడ గమనించవచ్చు. కవిత్వ సృజనలో కళావిలువలు ఎంత అవసరమో ఆ కళా విలువల క్రమం కవి ఆలోచనలకు అనుసంధానంగా ఉండటమూ అంతే అవసరం. కవిత్వంలో థాట్‌కీ, కళాక్రమానికీ ఉన్న ఈ బేసిక్ రిలేషన్‌ని Amiri Baraca మాటల్లో చూద్దాం :

"Thought is more important than art. To revere art and have no understanding of the process that forces it into scistence, is finally not even to understand what art is" కళాక్రమాన్ని ఉనికిలోకి తీసుకొచ్చే ఆలోచనల క్రమాన్ని పక్కనబెట్టి కళను పూజించుతూ పోయే ధోరణి వల్ల, కళంటే ఏంటో అర్థం చేసుకోవటంలోనూ విఫలమవుతామని యామిరీబారకా చేస్తున్న హెచ్చరిక కరెక్టే.

కవితలోని ఆలోచనకీ, ఇతివృత్తానికీ, అనుగుణమయిన మూడ్ క్రియేట్ అయినప్పుడు కవిత ఎలా ఉంటుందో చూడటానికి కూడా ఒక ఉదాహరణ తీసుకుందాం. ఇంతకు ముందు ఏ కవి గురించయితే మాట్లాడుకున్నామో అదే కవి content కీ Form కీ మధ్య ఎలా గొప్ప సమన్వయాన్ని సాధించాడో చూద్దాం. ఊళ్ళు ముంపునకు గురవుతున్న సందర్భంలో ఒక ఊరు తనను ముంచేయబోయే నదితో జరిపిన సంవేదనాత్మక మోనోలాగ్‌ను నిర్మించడం ద్వారా కవి నిర్మించిన సృజన క్రమం ఇది.

తడి ఇసుక మసక సడిలో

కనులు చెమ్మగిల్లిన గాలి

ప్రవాహాల తరబడి

ఒడ్డున బతుకుతున్న రావిచెట్టు
ఒంటరిగా ఏడుస్తున్నట్టు
దిగాలుపడ్డ వెలుతురు తెరపై
రాలిపడనొక –
దుఃఖపురంగు సాయంత్రము

ఇతివృత్తానికి సరిపడ వాతావరణాన్ని సృష్టించడమంటే, దానికనుగుణమయిన గొంతును సెట్ చేయటమంటే ఇదే. ఎత్తుకోవటం ఎత్తుకోవటమే నిర్వాసిత్వపు విషాదాన్ని పట్టిచ్చే వివిధ వస్తువుల సమాహారాన్ని సమకూర్చాడు : 'తడి ఇసక మసక సడి', 'కనులు చెమ్మగిల్లిన గాలి' 'ఒంటరిగా ఏడుస్తున్న రావిచెట్టు', 'దిగాలుపడ్డ వెలుతురు' 'దుఃఖపు రంగు సాయంత్రం', – ఇలా ప్రతి ప్రతిమా దట్టమైన విషాదానికి కాంట్రిబ్యూట్ చెయ్యగలిగింది. 'ఏళ్ళ తరబడి' అనే బదులు 'ప్రవాహాల తరబడి' అని ప్రయోగించటం, సాయంత్రానికి, 'దుఃఖపురంగు'ను ఆపాదించడం – ఇలాంటి సరికొత్త కవితా నుడికారాన్ని వాడి అత్యంత అధునాతన వ్యక్తీకరణకు తెరదీస్తూనే ఇతివృత్త స్వభావానికి కుదిరే వాతావరణాన్ని కవి నిర్మించాడు.

తనను ముంచివేయబోయేనదితో ఊరు మాట్లాడే ధోరణి పాఠకుల్ని కదిలిస్తుంది.

గుండెను నీలో కడిగి ఆరబెట్టుకుని
తేలిక పడతాననే కదా

అనడంలో భరించలేనంత విషాదం ఉంది. నదిలో మునిగే ఊరికి కలిగే అవకాశాలు :

అలలలో కదిలే రేలలు
రహస్యంగా వినేందుకు!
తియ్యని నీటి తీరని దాహం
మరణం వరకూ నెరవేరని ప్రేమ

ఇలా క్రమంగా విషాదాన్ని దట్టిస్తూ పాఠకుల్ని ఒక ప్రకంపనకు గురి చేస్తుంది కవిత. ఈ దుఃఖపు ఉక్కపోత నుంచి వచ్చిన ముగింపు ఇంకా ఉత్కంఠకు గురి చేస్తుంది.

శబరీ! చెప్పవే
హెూలీడిప్ అంటే
నీలో తడిసి పోవటమా
నిను తలచుకొని మెరిసిపోవడమా
నీ సంజె ఛాయలలో దూకి మరణించటమా
లేక...?

నదులిప్పుడు హోలీ డిప్‌ల బదులు హోలీడెత్‌లనిస్తున్న సన్నివేశానికి గుండెలు పిండేట్టు ముగింపునిస్తుంది కవిత.

కవి తనలోని ఉద్వేగానికీ, అలజడికీ, ఆదుర్దాకీ అనుగుణమయిన, సంబంధితమయిన వస్తువుల్ని, ప్రతిమల్నీ సమకూర్చుకోగలగటం కవిత్వీకరణలోని కీలకాంశం వస్తుగతీకరించలేని ఉద్వేగాలు,

ఉద్వేగీకరించలేని వస్తువులూ - రెండూ కవి బలహీనతని బయటపెడతాయి. కవిత పేలవంగా తేలిపోయేదిక్కడే. తెలంగాణ కరువు బీభత్సాన్ని చూసి కాగిపోయిన కవి, తనలో ఉడుకుతున్న ఉద్వేగానికి సరిపడే వస్తుజాలాన్ని వాస్తవ జీవితంనుంచి తీసుకున్న విధానం చూడండి.

నెర్రెలిచ్చిన నేలతల్లి బొక్కల కమురువాసన
ఊటబాయి కండ్లపొంటి ఉర్కుర్కి పొంగుతున్న ఉసురు
దిక్కులకు రెక్కలు గట్టుకున్న పచ్చులకు, బత్కుగిన్నెల
బిగుస్తున్న ఉచ్చు

ఉద్వేగాన్ని వస్తుగతీకరించటానికి చక్కని ఉదాహరణ ఈ వ్యక్తీకరణ. కరువుకు సంబంధించిన సీరియస్ వాతావరణం తాలూకూ మూడ్‌ని క్రియేట్ చెయ్యడంలో కవి సఫలమవ్వడానికి కారణం? కరువు సంబంధిత వస్తుజాలాన్ని వాస్తవ జీవితం నుంచి సరిగా ఎంపిక చేసుకోగలగటం కరువును చూసి కోపంగా కేకలు పెట్టటం, ఊగిపోవటం చెయ్యకుండా, ఆ ఊగిపోవటం తాలూకూ ఉద్వేగాన్ని నెర్రెలిచ్చిన నేల, దాని బొమికల కమురువాసన, ఊటబాయి కళ్ళలోనుంచి కారుతున్న దైన్యం, దిక్కూ మొక్కూలేని పక్షుల అసహాయత - ఇట్లాంటి భౌతిక వస్తు సంచయనం ద్వారా వెల్లడి చేశాడు కవి. ఇలాంటి శిల్ప నిర్మాణం వల్లనే కవి ఆశించిన ప్రయోజనం నెరవేరింది.

కనుక వ్యాసాల ద్వారా కాకుండా కవిత్వం ద్వారా తమ ఆలోచనోద్వేగాలను వ్యక్తం చెయ్యాలనుకునేవారూ, ప్రతి స్పందనలను తెలపాలనుకునేవారూ తగిన కవితారీతిని నిర్మించుకునే కళాక్రమంలో పాలు పంచుకోవాలి. ఒట్టి అభిప్రాయాలూ, కోపాలూ, తాపాలూ, దిగుళ్ళూ, ఆందోళనలూ వాటికవే కవిత్వం కాలేవు. నువ్వు రాసేది కవిత్వం కావాలనుకున్నప్పుడు కవితా విలువలు తప్పనిసరి. నువ్వు రాసింది గొప్ప కవిత్వమవుతుందా లేదా అనేది మాత్రం రాసిన ఇతివృత్తం మీద ఆధారపడి ఉంటుంది.

దేవిప్రియకు పతంజలి పురస్కారం

కె.ఎస్.వై.పతంజలి సాంస్కృతిక వేదిక ఏర్పాటు చేసిన పతంజలి సాహితీ పురస్కారాన్ని ఈ యేడాది దేవిప్రియకు ప్రదానం చేయనున్నారు. మార్చి 29న పతంజలి జయంతి నాడు విజయనగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రదాన సభ ఉంటుందని కార్యనిర్వాహక సభ్యులు జి.ఎస్.చలం తెలియజేస్తున్నారు. వక్తలు: రామతీర్థ, దుప్పల రవికుమార్.

శ్రీశ్రీ విశ్వేశ్వరరావుగారూ !

తక్కువ పుటల్లోనే వర్తమాన కవితకు అంత విలువైన ఆనరాగా పత్రికను రూపొందిస్తున్నందుకు హృదయపూర్వక అభినందనలు. పాపినేనిగారిపై ప్రత్యేక సంచిక నిజంగానే చాలా సమగ్రంగా రూపొందింది. ఆధునిక కవిత, కవితా తత్వాలపై కనీసం ఒకపేజీ నిడివిలో విమర్శనాత్మక పరిచయాలైతే మరింత బాగుణ్ణేమో, భవిష్యత్ అధ్యేతలకు...

మీ కృషి నిరంతరంగా, నిరంతరాయంగా కొనసాగాలని కోరుకొంటూ

నమస్కారాలతో
లక్ష్మీనారాయణ గంగిశెట్టి

లొకేషన్

మళయాళం : మనోజ్ కరూర్

అనువాదం : మందరపు హైమవతి

అలా
ఏడో పెగ్గులో వున్నప్పుడు
ఒక ఫ్రేములో
కథా రూపం
ఆగిపోయింది
ఏడుగురిలో
రచయితను నేను
ఆకుపచ్చకొండ మీద
ఎగురుతున్న జెండా
కొన్ని కదలికలను తెలియజెప్పింది

పక్కగదిలో నుంచి
చెమటతో తడిసిన
డైరెక్టర్ జోనీ
పైన ఒక
వర్షచిత్రాన్ని చిత్రించాడు
కింద
ఒక దేహచిత్రాన్ని గీసాడు
నిర్మాత షాజీ

వెళ్ళడానికి తొందరపడి
చిత్రకారుడు వర్మ
ఎడమచేతికింద ఒక కొడవలితో
పచ్చ ఎరుపు రంగులు గీసి
మట్టితో నిండిన జాకెట్టును
క్లోజప్పులో చిత్రీకరించాడు

లొకేషన్ వెదకడానికి వెళ్ళిన
అనిల్‌సునీల్
నుదుటిమీద పట్టిన చెమటను తుడుచుకొని
చిరునవ్వుతో
పక్క గదినుంచి వచ్చారు.

అందరి తర్వాత
చివర్లో నేను
పక్క గదిలో అడుగుపెట్టి
తిరిగివచ్చాను వెంటనే
తినడానికి
చపాతీ చికెన్
అందరికీ పంచాక
ఆమె బయటకు వచ్చింది
"ఇద్దరని చెప్పి...
పొద్దుటినుంచీ
పచ్చి మంచినీళ్లుగూడా ఇవ్వకుండా..
నాశనమైపోవాలని..."
శాపమిచ్చి
మెట్లు దిగకముందు
ఆమె విసరిన నోట్లు
ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్
ఏరుకున్నాడు

పక్కన గదికి వెళ్ళినపుడు
పచ్చరంగులో వున్న దుప్పటి మీద
ఎరుపురంగు
ఒక మనిషి పడుకున్నట్లు
గుర్తు కనబడి
"ఈ లొకేషన్ బావుంది" అని
తమాషాగా చెప్పాడు
అలమారాలో వున్న
ఒక అరలో
దాచిపెట్టిన కెమెరావైపు
వేలెత్తి చూపించి
డైరెక్టరు చెప్పాడు
'కట్' ■

చిత్ర ప్రదర్శన

కాశిరాజు లక్ష్మీనారాయణ 9494769293

జ్యోతి ప్రజ్వలించింది
చప్పట్లు మార్మోగాయి.
నలుగురు -
నలుగురంటే నలుగురే
చిత్ర రత్నాలను బంగారు పదాల్లో పొదిగి
రత్నమాల వేశారు.
ప్రసంగాల్లో
కళలూ, లలిత కళలూ
చిత్ర లేఖనం గురించి ఎన్నో విషయాలు
ఎందరో కళాకారుల వివరాలు
వారి అద్భుత ఆవిష్కరణలు
ఒకటేమిటి? అనేక ప్రస్తావనలు
అన్నీ అభినందనలే - ఆశీరార్థకాలే
కరతాళ ధ్వనులతో ప్రతిధ్వనించింది సభ
ఈ ప్రస్తావనల్లో
తన గురించి, తన చిత్రాల గురించి
ప్రశంసల జల్లులో
తడిసి ముద్దయ్యాడు చిత్రయ్య
ఔను మరి -
నెలరోజులు
రేయింబవళ్ళు పడిన కష్టం.
పట్టగానే కుంచె రంగులవైపు పరిగెత్తి
రంగస్థలంపై నాట్యం చేసేది
ఆ నాట్యపు పదముద్రలతో
కాన్వాస్ వేదిక అలరారేది
నాట్య ప్రదర్శన అంటే మాటలా !
రంగస్థలానికి
అలంకార సామాగ్రికి
నర్తకీమణి ఖర్చులుంటాయి.
ముప్ఫైరోజులు శ్రమ
పదివేల అప్పు వెరసి
ఏడెనిమిది చిత్రాలుగా దర్శనమిచ్చాయి
అది ఏడురోజులు జరిగే
ఇరవై మంది చిత్రకారుల
అద్భుత చిత్ర ప్రదర్శన
చూసినవారి కళ్ళు మెరిసి పోయేవి
పొగడ్తలకు కొదవలేదు.
పగలంతా
ప్రశంసలతో కడుపునింపుకొని
ఆనందం తాండవించే మొహం
రాత్రి ఇల్లు చేరగానే
ఏమండి! ఒక్కటైనా అమ్ముడు పోయిందా?
భార్య పలకరింపుతో
వాలిపోయేది. పాలిపోయేది.
కొండంత ఆనందం లోయల్లో పడిపోయేది.
రాదా మరి -
చిత్రయ్యకు
బొమ్మలంటే ప్రాణం
అతనికి వచ్చింది అదే
ఆమెకు నచ్చింది అదే -
అనురాగంతో ఎదనింపి
ఆప్యాయతతో ఆకలి తీర్చి
ఓదార్పుతో సేదదీర్చేది.
వేకువ మేల్కొలుపగా
తరుణారుణ ఆశలతో
చిరిగిన దుస్తులు, పెరిగిన గడ్డం
ఫ్యాషన్ కాగా
మొహానికింత చిరునవ్వద్దుకొని
గంపెడాశతో బయలుదేరాడు.
నిజంగా -
కళ కళకోసమే - ప్రజ కోసమే. ■

పరిమళకృష్ణ

దేవిప్రియ

ప్రకృతి ప్రసవించిన ఒక
ప్రాచ్యగమన పశ్చిమ పరిమళజల కృష్ణ.

మూడుభాషలు నేర్పి
మూడు పంటలు కూర్చి ...
ఉభయతీరాల వెంటా ఆశ్రితమానవుల
అనాది అభయ అన్నప్రదాత కృష్ణ

ఆదిమ జీవనధారగా
అనేకయుగాగమనాలను అరచేతి అద్దాలమీద
ప్రఫలించి ప్రసారం చేసిన
అమృతజలాద్భుత సాంబ్రాణి సౌగంధిక
ప్రసాదం కృష్ణ.

*　　*　　*

కోట్లాది ఎకరాలకి పచ్చపచ్చని సారం
గట్ల వెంట జనావాస సంరంభ సంసార
చిత్రలేఖనం
ద్రవిడక్షేత్రాలమీదికి
దండెత్తివచ్చిన అశ్వబలియాగ ప్రభంజన
విధ్వంస ఇతిహాస ముద్రితతాళపత్రం,
ఉత్తరాది వలసగాలులలో కలిసివచ్చిన
విచ్ఛిన్నయోచనల విభజన ఖడ్గచాలనలకి సాక్ష్యం...
తెప్పలు, తెరచాప పడవలు,
వ్యాపార నావలు, యుద్ధనౌకలు ఈదివచ్చిన
దురాక్రమణచరిత్రని అలల అక్షరమాలలో
నిక్షిప్తం చేసిన నిగూఢ చరిత్రకారిణి కృష్ణ.

*　　*　　*

ప్రవాహమార్గం వెంట
గాలిగోపురాలలో
తడిరెక్కలతో తిరిగివచ్చి
ముడుచుకుని కూర్చున్న పక్షులు
మడిబట్టలతో
లోతులేని నీళ్ళలో మునిగితేలే బైరాగులు
మసీదుగోడల
నీడలలోంచి తప్పెటలుమోగిస్తూ లేచే ఫకీరుల
చేతులు
అనంత విశ్రాంతి భూములలో
మొలిచి వికసించే సమాధిశిలువలు...
జాడలేని రుషివాటికలు
ఆచూకీ తెలియని అనేకానేక అధికార
శిలాశాసనాలూ
ఖండాలూ శతానేక సరిహద్దులూ దాటి
పర్వతాలూ, అరణ్యాలూ, మహోదధులూ దాటి
ఏటికి యెదురీది చేరిన రాజ్యవిస్తరణ కాంక్షలూ
చిలవలుపలవలయి
స్తూప చైత్ర శిధిలాలుగా మిగిలిన బౌద్ధజ్ఞాన
జ్ఞాపకాలూ
అలిసిసొలిసి ఒడ్డుమీద కొన ఊపిరితో
భవిష్యతరాలకోసం కొట్టుమిట్టాడుతున్న
బహుళనాగరికతల బ్రహ్మాండహృదయచలనాలూ

లంకల మీద నీటిపిట్టలా యెగురుతున్న
ఏటిగాలికి నిలువెత్తున
తలలూగుతున్న రెల్లుగడ్డిపూలూ
ఉండవల్లిగుహలలో ఇంకా
ఊపిరిపీల్చుకుంటున్న శయనబుద్ధ
శిల్పముద్రా...

* * *

నీ నీటి చుక్కల తడికోసం
నీ అడుగులకి మడుగులొత్తే
మాగాణి పొలాల సిరికోసం
నీ ప్రసన్న తరంగాల మీద
లఘుదీపపత్రపు
దోనెలు వదిలే భాగ్యం కోసం
జరిగిన యుద్ధాలెన్నో
ఒరిగిన వంశాలెన్నో
కూలిన శిఖరాలెన్నో
దగ్ధమయిన నగరాలెన్నో
పూడిన కాలువలెన్నో
మునిగిన చిహ్నిత పతాకాలెన్నో,
ఓ కృష్ణా ఓ క్రిష్ణవేణీ...

* * *

నా జీవధాత్రి
ఎగువ పలనాటి జొన్నపొలాలను
తడపకుండానే నాపరాతినేలలు దాటి
శతసహస్ర సంవత్సరాల తరువాత కూడా
నిర్దయగా నేటికీ నువ్వు పల్లానికి ప్రవహించి
పోతావు...
నీళ్ళంటే అక్కడ ఇప్పటికీ
వానలే కొండవాగులే
చంద్రవంకలే నాగులేళ్ళే...
పల్నాటివీరులు
కారంపూడి రణరంగంలో రక్తం పారించి
బరిసెలూ కత్తులూ కడిగినప్పుడు
నాగులేటిలో ఎర్రగులాబీరేకులై తేలివచ్చిన
నెత్తుటిచారికలు తాకినప్పుడయినా
గుర్తురాలేదా నీకు మాచర్ల గురజాల అరకల
ఆర్తనాదాలు...

* * *

పోనీ పోనీ...
అప్పుడెప్పుడో అమరావతి నుంచి మా నాన్న
వరిగడ్డిలో చుట్టి తీసుకువచ్చిన

మూడు మూరల వాలుగచేపగానైనా
గుర్తుంటావు నువ్వు
నీ అలౌకిక వర్ణసమ్మిళిత సూర్యాస్తమయాలతో,
నీ దివ్యమంత్రితపారవశ్యసమ్మోహక
చంద్రోదయాలతో...
నాగార్జునకొండనుంచి
లాంచీలో తిరిగివస్తున్నప్పుడుతళుకులీనుతూ
నీ నీటికళ్ళలో ప్రతిబింబించిన
పండువెన్నెలజల్లుగానైనా గుర్తుంటావు;
ఎందుకంటే
రోదసి కోనేటిలో విరిసిన
నక్షత్రపారిజాతాలలా నేనూ నిద్రపోను,
గగననగశిఖర జలపాతంలా దూకే
నువ్వూ నిద్రపోవు,
కనురెప్పలులేని కాలమత్స్యంలా
నీ కోసం యెదురుచూస్తున్న సముద్రమూ నిద్రపోదు,
అప్పుడూ ఇప్పుడూ ఇ..కొకప్పుడూ. ■

మార్మిక శూన్యం

రామా చంద్రమౌళి 93901 09993

నిజానికి చాలాసార్లు
మనకు ఏమి కావాలో మనకు తెలియదు
ఖాళీ గ్లాస్ వంటిది జీవితం అని ఒక ఉవాచ
గ్లాస్ సగం నిండి ఉందా..
సగం ఖాళీగా ఉందా అని ఒక చతురుడి ప్రశ్న
అసలు ఈ &#39 ఖాళీ &#39 ఏమిటి లోపల
.. ఆత్మలో అని ఒక మీమాంస
ఇక అన్వేషణ మొదలౌతుంది
అప్పుడు ఏదో అభౌతిక ప్రతిద్రవ్యం
(antimatter) దేహమంతా విస్తరిస్తూ
మనిషి ఒక ఆకాశమౌతూ..
ఒక అరణ్యమౌతూ.. ఒక సముద్రమౌతూ
కొండల్లోకి వ్యాపిస్తున్న రైలు పట్టాలౌతూ
లోయల లోతుల్లో పొగమంచుతో నిండిన
ఒక ఏకాంతమౌతూ
గమ్య రహితంగా ఎందుకో
ఆకాశాన్నీదుతున్న ఒంటరి పక్షి అవుతూ
ఎండుటాకులపై నడుస్తూ వెళ్తున్న పాదాలౌతూ
ఆత్మ నిండా అంతా మార్మిక శూన్యం..నిశ్శబ్ద ధ్వని
నిద్రిస్తున్న పాప
మూసిన పిడికిట్లో ఏముందో తెలుసా
పాప కనురెప్పల వెనుక ఎన్ని సంచలితాకాశాలు
సంభాషిస్తున్నాయో తెలుసా
కళ్ళేమో అప్పుడప్పుడు సముద్రాలౌతూ ..
మరొకప్పుడు గగన ద్వారాలౌతూ
ఒట్టి ఖాళీతనమే అంతిమమా.. అని ఒక చిత్త
విభ్రమ.. విచికిత్స –
ఖాళీతనం నిర్వచనం నిజంగా మనిషి
నిర్వాసితుడైనప్పుడే తెలుస్తుంది
పొరలు పొరలుగా తనను తాను
తవ్వుకుంటూ తవ్వుకుంటూ ..
నీటిలోకి రాయిలా జారిపోతూ
అసలు భౌతికమైన ఉనికినే కోల్పోయే ఒక
మహానుభూతి ఒకటి
ప్రతి మనిషినీ అప్పుడప్పుడు ఆవరించి
ఖాళీతనమే కరదీపమై నడిపిస్తున్న
దివ్యానుభవమొకటి ఎరుకౌతూంటుంది
అప్పుడు ఎదుట ఉన్న కొమ్మ పైకి
పక్షి ఎప్పుడు వచ్చి వాలిందో తెలియదు
వచ్చిన ఆ పక్షి ఎప్పుడు ఎగిరిపోతుందో కూడా
అర్థంకాదు –
అంతా శూన్య మార్మికత..ఒట్టి మార్మిక శూన్యమే■

ఇదిగో మాట

జి. లక్ష్మీనరసయ్య 92465 72073

అవసరమంటావా
అసలు చర్మాన్ని అన్నిరకాల లేపనాలతో
కప్పిపెట్టే మాట.
రుతువుల ప్రకారం
క్రతువులకి పాలుతాపే మాట
నిత్య నాటకాలతో తెల్లార్చుకునే మాట
అవసరమంటావా.
మనిషిముందు గజళ్ళను గుప్పి మనిషి వెనుక
నాగుబాము కోరల్ని దూసే మాట.
బ్రతికున్నప్పుడు
దొంగచాటుగా బరిసెల్ని విసిరి
చచ్చిపోయినాక ఎలిజీల్ని పండించే
ఎలాస్టిక్ మాట
ఏ ఎండకాగొడుగు పట్టేమాట
మాట్లాడక తప్పదంటావా
మాటంటే మనం నిర్వహించే ఫేస్‌బుక్ దర్బార్‌లో
లెక్క ప్రకారం కొట్టే లైక్‌ల కేకలనేగా నీ ఉద్దేశం
యాప్‌ల వీపుల్నుంచి మొలుచుకొచ్చే కళేబరాల
నృత్యమనేగా నీ భావం.
మాటనుంచి నిన్నూ నీనుంచి మాటనూ నువ్వే
విడదీసి, విసిరేసి బహిష్కరించుకున్నాక
ఏం మాట్లాడతావు మామా?
ముందు నీలో బుసకొడుతున్న బ్రూటస్‌నీ
లోపల నువ్వు మోస్తున్న
మురికి మడుగుల్నీ తొలగించు
మిణుగురు పురుగుల్లా
మాటలు నిన్ను చుట్టుముడతయ్ ■

బతుకు మందారం

మామిడి కోదండరామ్

అమ్మంటే
అడవి మందారం
పృధ్వీ అంచులపై
మొలకెత్తిన వేకువ సింధూరం
జీవన మాధుర్యాన్ని
వెదజల్లిన
ఆ వెన్నెల కెరటం మీద
కట్టుబాటే,
ముక్కు పుడకయ్యింది
వివక్షతే
ఔన్నత్యమయ్యింది.
తరతరాల పరాధీనతలో కొలువు తీరిన
పురుషాధిక్యతే.
కన్నీటికి చిరునామయ్యింది.
చిలకమ్మా!
ఎదురీతను మింగేసిన
మహావైనం మీద
పవిత్రతను వొలకబోసిన
మనవే కదమ్మా! మన మొదటి ముద్దాయి.
మనీ పాదాలకింద బోర్లాపడిన మీడియా
సగం ఆకాశాన్ని
అమ్మ తనానికి ఎలా దూరం చేస్తోందో చూడమ్మా
పాశ్చ్యాతుల విషవలయంలో చిక్కి
అందాల రోగైంది
చిందులు వేస్తున్న ఓ వ్యాపార ప్రకటనా!
నీవు అమ్మవు కావు
అమ్మవు కావు,
ఈజిప్టు లోయల్లో మమ్మీవి. ■

నేను

చెంగల్వ బొడ్డపాటి రామలక్ష్మి

ఉదయమే అటూ ఇటూ తిరుగుతూ
హడావిడి పని చేసుకుంటున్న వేళ
మాటల సందడికి
మౌన శ్రోతను !

భోజనం వడ్డించే వేళ
రుచులు రుచులుగా వంటను విమర్శించేటప్పుడు
నోరులేని మూగ జీవాన్ని!

అలసి సొలసి ఇంటికొచ్చిన
విశ్రాంతి వేళ
పాదసేవ చేస్తున్నప్పుడు
పరమ పతివ్రతను !

అతిథులు ఇంటికి వచ్చిన వేళ
ప్రశంసల వర్షంలో తడిసి ముద్దయి
పరవశించే వివశను !

అందమైన కవితల్లి
మొదటి తీర్పు నీదేనన్నప్పుడు
ఉపాధ్యాయినిని!

అంతర్యుద్ధంతో మాటలు లేక
ఇల్లు మౌనపోరాటం చేస్తున్న వేళ
మొదటి మాట కలిపినపుడు
రాజీతత్వానికి చిరునామాని !

తీరికవేళల మంజుల మధుర
మనోభావాలను
తెల్లకాగితాలపై కెక్కించేవేళ
నేనూ ఓ రచయిత్రిని !

వెరసి నేనో దిగువ మధ్యతరగతి స్త్రీని ! ■

కవి

సబ్బని లక్ష్మీనారాయణ 8985251271

అక్షరాల మాట పట్టుకొని
స్వచ్ఛమైన అనుభూతుల్ని
గిజిగాడి గూడులా
రమణీయంగా అల్లుతుంటాడు

పచ్చటి నవనవలాడే
చెట్టుపై కూర్చొని
ప్రకృతిలో లీనమై
కోయిలమ్మ లేలేత గొంతుతో
కవితా స్వరాలు వినిపిస్తుంటాడు

సభాజనంలో
పుష్ప, ఫలవృక్షంలా నిలిచి
మల్లెల సౌరభాలు,
మంచిమాటలు చెప్పి
జనుల్ని సమ్మోహితుల్ని చేస్తుంటాడు

కాలమనే ఒడిలో నిలిచి
జనసముద్రంలో పయనిస్తూ
మాటల పాటలు మార్మోగిస్తాడు
మనుషుల హృదయాలను జయిస్తాడు. ■

రచనలకు ఆహ్వానం

కవితలు, దీర్ఘకవితలు,
కవిత్వ విమర్శ వ్యాసాలు,
కవిత్వ పుస్తక సమీక్షలకు ఆహ్వానం

28-10-16, మసీదువీధి, అరండల్‌పేట,
కారల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ - 2
kavita.viswam@gmail.com

రా... ప్రియా....!

జనజ్వాల 9949163770

ప్రియా
రెప్పలు కంటున్న కలల్ని
చిదిమే కాలమంటూ ఒకటి వుంటుందని
అనుకోని కల కూడా జొరబడి
దృశ్యభయానకమౌతుందని
సంతకం చెదిరిన దుఃఖం...,
ఒంటరినీడపరచుకుని
భూమి వస్త్రమౌతుందని....,

కాలం శాసించిన జ్ఞానం మితి మీరి
స్థిమితం కోల్పోయిందని...
ఎలా చెప్పను
ప్రియా.... -

ఎండ అంటూసోకని...
వెలుగు అంటూ తాకని
తామరాకు క్రింద నీళ్లకు కూడా
దుఃఖం వుందని...,
చెప్ప లేక చెప్పింది,
వలలోచిక్కిన చేపపిల్ల -

ప్రియా
విశ్వం మీద పరచిన అనంతప్రేమ
అరుణపతాకంకూడా...., ఏమిటీ,
మూగబోయిన ఫరవాలేదు
గాలి చెక్కిళ్ల మీద -

ద్రోహమో... భయమో... ఏదోమరి
ఆత్మహత్యలు... అవార్డులు..,
అనుసంధాన నంబర్ల
జాతి ఉత్పత్తి అవుతూ..., చచ్చిపోతున్న క్యాపిటల్
కంటున్న కాలంమీద
కవి కూడా మళ్ళీ తప్పిపోతుండు
ప్రియా.......

జీవం మరణానికి మధ్యరేఖ
తనకంటు తాను తుడి చేసుకుని
వారసత్వ మట్టికి ద్రోహిగా
పాటకడుతుండు... పాడుతుండు-

మళ్ళీ వసంతం వస్తుందని ఆశతో....,
కొమ్మ ఎండిపోయి వుండవచ్చు
కొమ్మ మీది కోయిల ఎదురు చూపులతో
చూపు రేపటి ఆకాశం కాన్పుమీద
కొడిగట్టని దీపం పెట్టింది -

ప్రియా
చరిత ద్రోహాన్ని భరించదు
ఈరోజు అతడితో బాగా వుండవచ్చు...?
రేపంటూ వుంది కదా!

కాస్తా కన్నీళ్లు... కొంత అమరత్వం
మట్టిని త్రవ్వి పునర్జీవనం..., కొత్తతరం
సీతాకోకిల ముఖానికి ఇద్దాం
ప్రియా.. కవిత్వం అమ్మకం సరకుకాదని
ఆషామాషీల విన్యాసం కాదని
మళ్ళీ... రుజువు పత్రం మీద
ప్రమాణం చేద్దాం..
రా..ప్రియా!

కవిత్వం నింపుకున్న సంద్రం అలల పొత్తిళ్ల
ఇసుకదిబ్బల అడుగులతో...రా!
తప్పిపోతున్న మనిషికి.. జీవంకోల్పోతున్న
ప్రాణికి, ఎప్పటివలె
పద్యం ఉద్యమంలానే ఇద్దాం
రా.. ప్రియా...! ■



నిరంతర ప్రవాహం గోపి కవిత్వం

సుమారు ఒక అర శతాబ్దం నుంచి ధారధారలుగా మొదలై సెలయేళ్లుగా నిరంతరం ప్రవహిస్తున్నది గోపి కవిత్వం. గత పది సంవత్సరాలుగా తన పుట్టిన రోజున ఓ కొత్త కవితా సంపుటితో పాఠకుల ముందుకు రావడం ఆయనకొక ఆనవాయితి అయింది. ఈసారి ఇంత ఆకాశంలో మట్టిని మన ముందు కుప్పపోసాడు గోపి. "మట్టికి కాలాన్ని తినిపిస్తే, అది చెట్టై నవ్వుతుంది. మట్టిపై వర్షాన్ని చిలకరిస్తే, అది నదులై పారుతుంది" అంటూ ఆకాశాన్ని మట్టిని కలిపే జలధారను ప్రస్తావిస్తూ ప్రారంభమైన ఈ సంపుటి నిండా కవి అనుభవంలోని అనేక జ్ఞాపకాలు పాఠకుల ముందుకు నడిచొస్తాయి.

అకవిత్వం కవిత్వం అని బుకాయిస్తున్న కాలంలో నగరాన్ని కవిత్వాన్ని కలగలిపి "రోడ్ల మీద ట్రాఫిక్, సంక్లిష్ట వాక్యంలా ఉంటుంది" అని మొదలుపెట్టి "నగరం వట్టి శుష్కవచనంగా మారిపోతుంది" అంటాడు. కవితా నిర్మాణ పద్ధతుల ప్రాథమిక జ్ఞానం కూడా లేకుండా రాసేవారి కవిత్వంలో "మలుపులు తిరిగిన, ఫ్లైవోవర్ల హొయల్లో, కవిత్వముండదు". కవిత్వాన్ని సీరియస్‌గా తీసుకొని "కవిత్వాన్ని జీవిస్తాను, జీవితాన్ని కవిత్వీకరిస్తాను, నేను కవిత్వం కానప్పుడు మరణిస్తాను" అన్న ఓ కవి మాటల్ని ఇప్పటితరం కవులు తమకు ఆపాదించుకోకపోవడం వలన కవిత్వం ఎంత పలచన అవుతుందో గోపి తన కవితలో ఆవేదన వ్యక్తం చేశాడు.

గోపి నిరంతర సంచారి. ఎక్కడికి వెళ్లినా అక్కడి స్థానీయతను తన కవిత్వంలో ప్రతిబింబిస్తుంటాడు. అందుకే "నువ్వు ఏ ఊరికి వెళుతున్నావని అడగను, వచ్చేటప్పుడు మాత్రం ఓ పద్యం పట్టుకురా!" అంటాడు. పిల్లబాటలో వెళితే ఓ తంగేడు పువ్వును, రైలులో వెళితే రెండు కొండల మధ్య చిక్కుకున్న సంధ్యా సూర్యుడ్ని, విమానంలో వెళితే ఓ మేఘ శకలాన్ని వెచ్చని కవితలా మార్చి వెంట బెట్టుకురమ్మంటాడు. శిశువు గురించి ఎవరు ఎన్నిసార్లు చెప్పినా కొత్తగానే ఉంటుంది. మళ్లీ ఒకసారి గోపి పసిపాప నవ్వుని గొప్పగా అనుభూతింపజేశాడు. "ఆమె భుజంమీ్మద పసిపాప నన్ను చూసి నవ్వింది. గాలి కాన్వాసుమీద కాంతి చిత్రాలు వెల్లివిరిసాయి" అంటూ మొదలైన కవితలో పాప ఉంగాభాష, పాప నిద్ర, బంగారు నవ్వు మొదలైన వాటన్నింటిని మనముందు చిత్ర రూప మాత్రంగా దర్శింపజేస్తారు.

గోపి కవిత్వం ఒక జల. నిరంతరం ఊరుతూనే వుంటుంది. ఏదో ఒక అనుభూతినో, అనుభవాన్నో, సమస్యనో కవిత్వంగా మలచడం ఆయన నిత్య కృత్యం. ఆయన పంపిన అక్షరాలు మన గుండెలను తడతాయి. ఒకవేళ మనం స్పందించకపోతే అది మనలోపమేకాని ఆ అక్షరాలు మాత్రం నిరాశపడవు. లోకమంతా తిరిగి మళ్లీ మన ఇంటి ముందే నిలబడతాయి.

– బండ్ల మాధవరావు

ఆకాశంలో మట్టి – డా॥ ఎన్. గోపి; వెల : రూ. **150.**
దొరుకుచోటు : ఎన్. అరుణ, 13-1/5బి, శ్రీనివాసపురం,
రామాంతపూర్, హైదరాబాద్ - 13. ఫోన్ : 9391028496

మర్మ ఊపిరి... తుపాను నిట్టూర్పు



కవికి అజ్ఞాతంగా జీవితం ఏమి ప్రసాదిస్తుందో, అతను నడిచినంత మేరా దానినే తలా కొంచెం పంచిపెడతాడు. అయితే సంతోషతరంగాన్ని ఒక కలువ పువ్వులాగ, అశ్రుబిందువుని ఒక మంచి ముత్యంలాగ మలచి అపురూపంగా మన చేతులకి అందిస్తాడు. ఆ సుతార పరిమళం, ఆ సౌందర్య ధావళ్యం మనలో ఏ పురాస్మృతులను కెరలిస్తుందో, ఏ నవనీత అనుభూతులను కల్పిస్తుందో ఆ కవి మనకు అత్యంత సన్నిహితుడవుతాడు. మన కల్లోల కాలంలో అటువంటి కవిమిత్రుడు చింతలపల్లి అనంతు.

ఇది నిన్నామొన్నటి సంరంభం కాదు. మన మహానగరంలో ఇరవై ఏళ్ళ కిందట ఆరంభమైన సృజన, సహవాసం, అంతరాళ రంగభూమిలో ఎన్నటికీ చెరిగిపోని రంగవల్లులు అవి. నేను కూడ చెప్పవలసిన సంగతులు వున్నాయి, కాసేపు మాట్లాడనివ్వండి నన్ను. ఓ మునిమాపున జనసమ్మర్ధం. ప్రాణం లేచివచ్చే పొగాకు వాసనకి ఫ్యాక్టరీ పక్కన నిలుచునున్నాం. అనంతు తొలిసారి తన కవిత వినిపించాడు. మళ్ళీ చదివించుకొన్నాం.

అంతటి రణగొణధ్వనిలో ఒమ్మి రమేష్‌బాబు, నేనూ సంభ్రమాశ్చర్యాలతో విన్నాం. ఆనాటి నుంచి ఇవాళ్టి వరకు అతని కవిత ఏ ఒక్కటీ మా దృష్టి పథంలోంచి తప్పించుకొని పోలేదు. నేను బహుదూరంలో వున్నప్పటికీ, అనేక ఋతువుల తరబడి ఏకాంత రాత్రులలో అతను రాసిన కవితలు వినిపించుకొస్తున్నాడు. 'సాఫల్యం' అనే అద్భుత కవితలో "నీ ఊపిరిలో సాహచర్య జంత్ర లయలు / వేసవి వెన్నెల లోయల చెలమలై / ఊరటగా ఊరిపురకలేస్తుంటే / గుండె నిండా / నీ తొలి మలి సంజెల నీడల బారులు / ఊహల కలల కాంక్షల ఉక్కిరిబిక్కిరిలో / చైత్ర చినుకులై చిందులు తొక్కుతుంటే / నువ్వు / తప్పిపోయిన చౌరస్తాలకే / చెక్కు చెదరని చుక్కానివి" అంటున్నాడు. ఈనాటికీ అదే అంతర్ముఖత, అంతే లలితం. అందుకనే అతని కవితంటే మాకు పదింతలైన మక్కువ. దాదాపుగా అన్ని కవితలకి నేను తొలి శ్రోతని లేదా పాఠకుడిని. ప్రతి పర్యాయం తెలుగు కవితలాగ లేశమాత్రం లేదని చకచ్చకితుడనయ్యాను. ఇన్నాళ్ళకి ఎంపిక చేసిన తన కవితలను 'ద్వీప కూటమి' పేరిట దండగుచ్చాడు.

- నామాడి శ్రీధర్

ద్వీపకూటమి - అనంతు, వెల : రూ. **200.**
దొరుకుచోటు : నామాడి శ్రీధర్, 3-129, అంబాజీపేట,
తూ.గో.జిల్లా - 533 214 సెల్ : 93968 07070.

Regd No 48/2012/IV

ప్రచురణలు

1.	'మో' సారాంశం - మో	- రూ.	150/-
2.	'మో' నిషాదం - మో	- రూ.	100/-
3.	రహస్తంత్రి - మో	- రూ.	50/-
4.	పునరపి - మో	- రూ.	40/-
5.	వెన్నెల నీడలు - మో	- రూ.	100/-
6.	చితి-చింత - మో	- రూ.	50/-
7.	ఇన్‌షాఅల్లాహ్ - దేవిప్రియ	- రూ.	20/-
8.	జాగ్తేరహో - శివసాగర్	- రూ.	100/-
9.	హాస్యకవితలు - పన్నాల సుబ్రహ్మణ్యభట్టు (సం.)	- రూ.	50/-
10.	అనుపమ - బండ్ల మాధవరావు	- రూ.	100/-
11.	కవిత - 2004 - పాపినేని, దర్భశయనం (సం.)	- రూ.	80/-
12.	కవిత - 2005 - 〃	- రూ.	75/-
13.	కవిత - 2006, 2007 - 〃 (ఒకొకటి)	- రూ.	80/-
14.	కవిత - 2008, 2009, 2010- 〃 (సం) (ఒకొకటి)	- రూ.	100/-
15.	కవిత - 2011, 2012, 2013- 〃 (సం) (ఒకొకటి)	- రూ.	120/-
16.	కవిత - 2014, 2015 (సం) (ఒకొకటి)	- రూ.	150/-
17.	అల్విదా - కౌముది	- రూ.	100/-
18.	గొల్లపూడి మారుతీయం - గొల్లపూడి మారుతీరావు	- రూ.	100/-
19.	భాగ్యనగరం - నార్ల చిరంజీవి	- రూ.	50/-
20.	ఎగరేసిన ఎర్రని జెండా - టి.వి.ఆర్. చంద్రం	- రూ.	30/-
21.	మహాకవి గురజాడ	- రూ.	40/-
22.	అగ్నిసరస్సున వికసించిన వజ్రం - నార్ల చిరంజీవి	- రూ.	30/-
23.	మార్క్స్, ఏంగెల్స్‌ల జీవిత రేఖలు - చే	- రూ.	30/-
24.	చే (ఎ ప్రైమెట్)	- రూ.	50/-
25.	పతంజలి తలపులు	- రూ.	125/-
26.	దొంగదాడికథ	- రూ.	100/-
27.	స్మైల్‌జ్ఞాపకాలు	- రూ.	100/-
28.	జ్యూలియస్ ఫ్యూజిక్ - ఉషా ఎస్ డాని	- రూ.	60/-
29.	చందనపు బొమ్మ - అరుణ పప్పు (కథలు)	- రూ.	120/-
30.	2012 ప్రాతినిధ్య (కథాసంకలనం) - కుప్పిలి పద్మ, సామాన్య	- రూ.	60/-
31.	శబ్దవిరించి శ్రీశ్రీ - యు.ఎ. నరసింహమూర్తి	- రూ.	50/-
32.	సిగ్నేచర్ ట్యూన్ - సి. మృణాళిని ('మో' స్మారకోపన్యాసం)	- రూ.	30/-
33.	రహస్యోద్యమం - త్రిపురనేని శ్రీనివాస్	- రూ.	50/-
34.	మ్యూజిక్ డైస్ - అరుణ్ సాగర్	- రూ.	70/-
35.	అరుణ్ సాగర్ సంగమం *(అరుణ్‌సాగర్ జ్ఞాపకాల ప్రత్యేక సంచిక)*	- రూ.	150/-
36.	మహాసంకల్పం (నవల) - డాక్టర్ వాసుదేవ్	- రూ.	200/-
37.	తీరందాటిన నాలుగు కెరటాలు.....(కవిత్వం)	- రూ.	80/-
38.	పుట్టుమచ్చ.. - ఖాదర్ మొహియుద్దీన్	- రూ.	100/-
39.	దిగంబర కవులు (మూడు కవితాసంకలనాల ఏకైక సంపుటం)	- రూ.	200/-
40.	ధిక్కారవాదం దిగంబర కవిత్వం - జూపల్లి ప్రేమ్‌చంద్	- రూ.	80/-



BCi

KRSA101M130

AIM HIGH

Sikhara

school of excellence

an IIT foundation school

8, 9 & 10th
integrated syllabus
(CBSE, ICSE, State)

Admissions
are in
Progress

supported by

FIITJEE

Near CR Library, Sikhamani Centre
Prajasakthi Nagar, Vijayawada-520 010.

Call us : 73311 37756

edited, printed and published by: Visweswara Rao # 28-10-26/1, Arundel pet, Vijayawada-2
Printed by him at: Sri Sri Printers, Arundel pet, Vijayawada-2

₹25

BC

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA101M130
పుస్తకం పేరు	కవితా
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	37
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Vedavathi
పేజీలు విడదీసినది	Vedavathi
స్కాన్ చేసినది	Sharmila
పరీక్ష చేసినది	hema
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good